


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | శుక్రవారం 14-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:11 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

## -విరిగిపడుతున్న కొండచరియలు

డెహ్రాడూన్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలకు చాలాప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతుండగా





నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. చమోలీ జిల్లాలో కుండపోత వర్షానికి కొండచరియలు విరిగిపడుతుండడంతో స్థానికులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. బద్రీనాథ్ జాతీయరహదారితోపాటు పలు రహదారులపై రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు వరద పోటెత్తడంతో అలకనంద, పిండేర్, నందాకిని నదులు ప్రమాదకర స్థాయికి అతి చేరువలో ప్రవహిస్తున్నామని ఆ జిల్లా మేజిస్ట్రేట్ స్వాతి ఎస్ భదోరియా తెలిపారు. పితోర్‌ఘర్, ధర్చాలా జిల్లాలో చాలారోడ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. 12–14 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ అనిల్ కుమార్ శుక్లా తెలిపారు. జాతీయ విపత్తు స్పందనా దళాలు, రాష్ట్ర విపత్తు స్పందనా దళాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. కూలిపోయిన విద్యుత్ స్తంభాలను సిబ్బంది సరి చేస్తున్నారు. ఇదిలాఉండగా రానున్న 48 గంటల్లో పితోర్‌ఘర్, భాగేశ్వర్, చమోలీ, నైనిటాల్, ఉదమ్‌సింగ్ నగర్, పౌరీ, తెహ్రీ, డెహ్రాడూన్, హరిద్వార్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

# టీఆర్ఎస్ ఎంపి కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు కరోనా

హైదరాబాద్,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో టీఆర్ఎస్ నేతలను కరోనా వీడడం లేదు. ఇప్పటికే అనేకమంది నేతలు కరోనా బారిన పడ్డారు. దీంతో కరోనా బారినపడుతున్న నాయకుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు కరోనా సోకినట్లు తెలిసింది. ఆయనతో పాటు ఆయన సతీమణి సరోజినీ దేవికి కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. వీరిద్దరు ప్రస్తుతం హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గతంలో లక్ష్మీకాంతరావు కుమారుడు, హుస్నాబాద్ ఎమ్మెల్యే అయిన సతీష్ బాబు కూడా కరోనా బారినపడ్డారు. ఆయన ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకొని కరోనా నుంచి బయట పడ్డారు.

# ఫేక్‌న్యూస్ కర్మాగారంగా సోషల్ మీడియా

## ప్రణబ్ మృతి వార్తలపై మండిపడ్డ అభిజిత్ ముఖర్జీ

కోల్‌కతా,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఇకలేరని సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై ఆయన కుమారుడు అభిజిత్ ముఖర్జీ స్పందించారు. తన తండ్రి బ్రతికే ఉన్నారని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు. త్వరలో కోలుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన కోసం మీ ప్రార్థనలకు కొనసాగించాల్సిందిగా కోరుతూ ట్వీట్ చేశారు. తన తండ్రి ఆరోగ్యంపై ప్రముఖ జర్నలిస్టులు సోషల్ మీడియా వేదికగా చేస్తున్నప్రచారం దేశంలో మీడియా ఫేక్ న్యూస్ కర్మాగాంంగా మారిన అంశాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఇదిలావుంటే తన తండ్రి, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గురించి జరుగుతున్న పుకార్లన్ని అబద్ధమని ఆయన కూతురు షర్మిష్ట ముఖర్జీ తెలిపారు. ట్విట్టర్ ద్వారా ఆమె స్పందిస్తూ... ఎవరూ తనకు కాల్ చేయొద్దని ప్రత్యేకంగా మీడియాకు తెలుపుతున్నట్లు ఆమె చెప్పారు. ఈ సమయంలో ఆస్పత్రి నుంచి సమాచారం అందుకునేందుకు తన ఫోన్‌ను ఫ్రీగా ఉంచదలచినట్లు పేర్కొన్నారు. తన తండ్రి బ్రతికే ఉన్నారని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు. త్వరలో కోలుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

# నిలకడగా ప్రణబ్ ఆరోగ్యం

## కోమాలోనే ఉన్నారన్న ఆర్మీ ఆస్పత్రి వర్గాలు

న్యూఢిల్లీ,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఢిల్లీలోని ఆర్మీ హాస్పిటల్ పేర్కొన్నది. ఆర్మీ ఆస్పత్రి వర్గాలు ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితిపై ఉదయం స్పందిస్తూ... ప్రణబ్ ఇంకా దీర్ఘ కోమాలోనే ఉన్నట్లు తెలిపాయి. అయినప్పటికీ రక్త ప్రసరణ సవ్యంగానే సాగుతోందన్నారు. వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ప్రణబ్ ఆరోగ్య పరిస్థితిని నిపుణుల బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని ప్రకటించింది. సోమవారం ప్రణబ్‌కు బ్రెయిన్ సర్జరీ జరిగింది. అయితే 2007 లో జరిగిన కారు ప్రమాదం వల్లే ప్రణబ్ తలకు గాయాలైనట్లు ఓ బెంగాలీ డాక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన డాక్టర్ బాసుదేవ్ మోండల్ .. ప్రణబ్‌కు గతంలో ట్రీట్మెంట్ ఇచ్చారు. 2007, ఏప్రిల్ 7వ తేదీన ముర్షీదాబాద్ జిల్లా నుంచి కోల్‌కతాకు తిరిగి వస్తున్న సమయంలో ప్రణబ్ కారు మరో వాహనాన్ని ఢీకొట్టింది. అప్పుడు ఆయన తలకు గాయాలైనట్లు డాక్టర్ బాసుదేవ్ తెలిపారు. 2007లో ప్రణబ్ విదేశాంగ మంత్రిగా ఉన్నారు. అయితే ప్రమాదం జరిగిన రోజురాత్రి తొలుత ప్రణబ్‌ను స్థానిక హెల్త్ సెంటర్‌కు తీసుకువెళ్లారు. అక్కడ ఆయన తలకు కుట్లు వేశారని, ఆ తర్వాత ఆయన కృష్ణానగర్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే ఆ హాస్పిటల్‌లో సీటీ స్కాన్, ఎక్స్ రే సౌకర్యాలు లేని కారణంగా.. జిల్లా అధికారులు ప్రణబ్‌ను తన హాస్పిటల్‌కు తీసుకువచ్చినట్లు గైనకాలజిస్ట్ బాసుదేవ్ మోండల్ తెలిపారు. కొందరు డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రణబ్‌ను తన నర్సింగ్ హోమ్‌కు తీసుకు వచ్చినట్లు చెప్పారు. వాస్తవానికి ప్రణబ్‌కు ఆ సమయంలో తలకు తీవ్ర గాయమైందని, నొప్పి అధికంగా ఉన్నా ఆయన మాత్రం చాలా శాంతంగాన, మౌనంగా ఉన్నారన్నారు. చాలా మర్యాదపూర్వంగా వ్యవహరించినట్లు చెప్పారు. పరీక్షలు జరిపిన తర్వాత ఆయనకు ఇంటర్నల్ ఇంజ్యూరీ జరగలేదని నిర్ధారించినట్లు డాక్టర్ బాసుదేవ్ తెలిపారు. ఆ తర్వాత ప్రణబ్‌ను కోల్‌కతాకు తీసుకువెళ్లినట్లు చెప్పారు

# దేశంలో ఇక పారదర్శక పన్నులు విధానం

## ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజానికి పన్ను సంస్కరణలు
## పన్నుల రేట్లు తగ్గింపు, నిబంధనల సరళీకరణలే లక్ష్యం
## నిజాయితీగా పన్ను చెల్లించేవారికి పారదర్శక వేదికలు
## సెప్టంబర్ 25 నుంచి ఫేస్‌లెస్ అప్పీల్ సేవలు
## కొత్త పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట 13(ఆర్ఎన్ఎ): ఆదాయపన్ను వ్యవస్థ బలోపేతానికి మరిన్ని సంస్కరణలు తీసుకువస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం పారదర్శక పన్నుల విధాన పథకంను ప్రారంభించారు. 'ట్రాన్స్‌పరెంట్ ట్యాక్సేషన్– హానరింగ్ ద హానెస్ట్' పథకం లక్ష్యాలను వివరించారు. బ్రిటిష్ కాలం నాటి పన్నుల విధానానికి చెల్లుచీటి పలుకుతున్నామని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తెచ్చేందుకు 'పారదర్శక పన్నుల విధాన వేదిక' ఉపయోగపడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా మోదీ గురువారం పారదర్శక పన్నుల విధాన వేదిక కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజానికి పన్ను సంస్కరణలు అవసరమన్నారు. ప్రత్యేక వేదిక ద్వారా సులువుగా ఫిర్యాదు చేయవచ్చునని వ్యాఖ్యానించారు. నిజాయితీగా పన్ను చెల్లించేవారికి ప్రత్యేక వేదిక ఎంతో ఉపయోగమన్నారు. పన్ను సంస్కరణల్లో పాలసీ ఆధారిత పరిపాలన అవసరమని మోదీ పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు మరింత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబరు 25 నుంచి ఫేస్‌లెస్ అప్పీల్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే ఆదాయ, కార్పొరేటు పన్ను తగ్గించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నిజాయితీగా పన్ను చెల్లించేవారికి ఇలాంటి పారదర్శక వేదికలు మరింత లబ్ధి చేకూరుస్తాయి. పన్ను సంస్కరణల్లో పాలసీ ఆధారిత పరిపాలన అవసరం ఉందని మోదీ వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజానికి పన్ను సంస్కరణలు అవసరమని తెలిపారు. కరోనా కష్ట కాలంలోనూ రికార్డు స్థాయిలో ఎఫ్‌డీఐలు వచ్చాయి. సెప్టంబర్ 25 నుంచి ఫేస్‌లెస్




అప్పీల్ సేవలను ప్రారంభించనున్నట్లు మోదీ తెలిపారు.

ఇటీవలి కాలంలో ప్రత్యక్ష పన్నుల విధానంలో పలు మార్పులు తీసుకొచ్చిందని, గతేడాది కార్పొరేట్ ట్యాక్స్ రేట్లను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించామని, కొత్త తయారీ సంస్థలకు దీన్ని పదిహేను శాతం చేశామని వివరించింది. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్నును కూడా రద్దు చేసినట్లు తెలిపింది. పన్నుల రేట్లు తగ్గింపు, నిబంధనల సరళీకరణలే లక్ష్యంగా ప్రత్యక్ష పన్నుల విధానంలో సంస్కరణలు తీసుకువస్తున్నట్లు మోదీ తెలిపారు. పన్ను చెల్లింపుదారుల కోసం కేంద్ర ప్రభుత్వం మరింత సరళమైన, సౌకర్యవంతమైన విధానాన్ని ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు స్క్రుటినీ కోసం, అప్పీళ్ల కోసం నేరుగా హాజరయ్యే అవసరం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఈ సరికొత్త వేదికను ప్రారంభించారు. సకాలంలో పన్ను బకాయిలు చెల్లించి దేశ నిర్మాణం కోసం తోడ్పాటు అందించాలని ప్రధాని ఈ సందర్భంగా ప్రజలను అభ్యర్థించారు. అటు పన్ను చెల్లింపుదారులు, ఇటు అధికారులకు సంబంధించిన హక్కులు, బాధ్యతలను నిర్దేశిరచే పన్ను చెల్లింపుదారుల చార్టర్ కూడా ఐటీ శాఖ అమలుచేయనుంది. అతి తక్కువ కార్పొరేట్ పన్నులను వసూలు చేసే దేశాల్లో భారత్ కూడా ఒకటనీ.. భారత పన్ను వ్యవస్థలో ప్రాథమిక సంస్కరణలు అవసరమని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పన్నువిధానం అతుకులు లేకుండా, నొప్పి లేకుండా, పన్నుదారుడు నేరుగా హాజరు కాకుండా ఉండే విధంగా తయారు చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నవారిని మరింత ప్రోత్సహిస్తామన్నారు. ప్రత్యేక వేదిక ద్వారా ఫిర్యాదులు సులువుగా చేయవచ్చు అన్నారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పన్ను విధానంలో మరిన్ని సంస్కరణలను తీసుకువస్తున్నట్లు తెలిపారు. పారదర్శక పన్నువిధానంలో ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ అతిపెద్ద సంస్కరణ అన్నారు. ఫేస్‌లెస్ అపీల్, పన్నుదారుల పట్టిక కూడా సంస్కరణలో భాగమే అన్నారు. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్, ట్యాక్స్ పేయర్ చార్టర్‌లు నేటి నుంచే అమలులోకి వస్తాయన్నారు. ఏదో ఒక వత్తిడిలో సంస్కరణల పేరుతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారని, అలాంటి వాటితో లక్ష్యాలను చేరుకోలేమన్నారు. అలాటి ఆలోచన, వ్యవహారం అన్నీ మారినట్లు ప్రధాని తెలిపారు. పన్నువిధానాన్ని సాఫీగా తయారు చేయడం తమ ఉద్దేశమన్నారు. దేశాభివృద్ధి ప్రయాణంలో పన్నుదారుడి చార్టర్ కూడా పెద్ద ముందడుగే అని తెలిపారు. పన్నుదారులను మరింత శక్తివంతంగా తయారు చేయడమే ప్రధాని లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పన్నువిధానంలో పారదర్శకత ఉండాలని, నిజాయితీపరుడైన పన్నుదారుల్ని గౌరవించాలన్నదే ప్రధాని లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌లతోపాటు దేశంలోని వాణిజ్య సంస్థలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, గణనీయమైన పన్ను చెల్లింపుదారుల అసోసియేషన్లు పాల్గొన్నారు.

# దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ విలయ తాండవం కొనసాగుతోంది. పాజిటివ్ కేసుల తీవ్రత యధాతథంగా పెరుగుతూ ఉంది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా 66,999 మంది కరోనా బారిన పడ్డారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 23,96,638కు చేరింది. బుధవారం రికార్డు స్థాయిలో 942 మంది కరోనాతో మృత్యువాతపడటంతో ఇప్పటి వరకు

## 70 శాతానికి పెరిగిన రికవరీ

47,033 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అత్యధిక మరణాలు సంభవించిన దేశాల్లో భారత్ యూకేను దాటేసి నాలుగో స్థానానికి ఎగబాకింది. భారత్‌లో ప్రస్తుతం 6,53,622 యాక్టివ్ కేసులు ఉండగా, 16,95,982 మంది డిశ్చార్జి అయ్యారు. దేశంలో కరోనా రికవరీ రేటు 70 శాతం ఉంది. బుధవారం 8,30,391 టెస్టులు చేయగా మొత్తం ఇప్పటి వరకు 2,68,45,688 కరోనా నిర్దారణ పరీక్షలు నిర్వహించారు. కాగా దేశంలో అత్యధిక కేసులు మహారాష్ట్రలోనే నమోదవు తున్నాయి. ఆ రాష్ట్రంలో 5,48,313 కేసులు ఉండగా, 3,14,520 కేసులతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 2,50,000 మందికి కరోనా సోకగా, కర్ణాటకలో ఈ సంఖ్య 1,82,354గా ఉంది. అలాగే 1,47,391 కేసులతో దేశ రాజధాని ఢిల్లీ అయిదో స్థానంలో ఉంది. దాంతో మొత్తం కరోనా కేసుల సంఖ్య దాదాపు 24 లక్షలకు చేరువైంది. దేశంలో ప్రతిరోజు పాజిటివ్ కేసులు భారీగా నమోదవుతున్న ప్పటికీ, కోలుకుంటున్న వారిసంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం దేశంలో కరోనా రికవరీ రేటు 70.76 శాతానికి చేరుకోగా.. మరణాల రేటు 1.98 శాతంగా ఉంది. నిన్నటివరకు దేశంలో 2,68,45,688 కరోనా టెస్టులు చేసినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. బుధవారం ఒక్కరోజే 8,30,391 శాంపిళ్లను టెస్ట్ చేసినట్లు తెలిపింది.

# నేడు గాంధీనగర్ బస్తీ దవఖానకు ప్రారంభోత్సవం

హైదరాబాద్,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్‌లోని కోదండరెడ్డి పార్కు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను శుక్రవారం ప్రారంభించనున్నారు. మంత్రి తలసాని దీనిని ప్రారంభిస్తారని సమాచారం. గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణమెహన్‌తో కలిసి కార్పోరేటర్ పరిశీలించారు. బస్తీ దవాఖానా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతారని ఆయన తెలిపారు. వారితోపాటు జిల్యా వైద్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ల పరిధిలోని శారదానగర్, రాంరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణాల్లో శుక్రవారం ఉదయం బస్తీ దవాఖానాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భేతి సుభాష్రెడ్డి, జీహెచ్ఎంసీ తూర్పు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రారంభిస్తారని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి తెలిపారు.

# జెండా ఆవిష్కరణ అతిథుల్లో మార్పులు

## -మేడ్చెల్‌కు బోయిన్‌పలి ఇన్‌ఛార్జ్

హైదరాబాద్,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): పంద్రాగస్టు సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించే జిల్లా ఇంచార్జీలలో స్వల్ప మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జరిగే పంద్రాగస్టు వేడుకల ఇంచార్జిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ లను ప్రభుత్వం నియమించింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ మనసును దోచెడి హాంది
సినిమా లందున చతురత చిలికింపంగన్
ఘనతరముగ పేరొందెను
జనముల వంశజుడు...విదుడు..."జానీ లీవర్" !!

( ఆగష్టు 14 జానీలీవర్ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210



# బిజెపి ఎంపి తప్పుడు అఫిడవిట్

## లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయాలన్న తృణమూల్

కోల్‌కతా,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): బీజేపీ నాయకుడు అర్జున్‌సింగ్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని ఆరోపించింది. కాగా ఈ ఆరోపణలు నిరాధారమైనవి అర్జున్‌సింగ్ కొట్టిపారేశారు. ఆరోపణలను నిరూపించాల్సిందిగా అధికార పార్టీకి సవాల్ విసిరారు. అర్జున్‌సింగ్ 2019లో టీఎంసీని వీడి బీజేపీలో చేరారు. బరాక్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా కొనసాగుతున్నారు. కోట్ల విలువైన షేర్లను ఆయన కలిగి ఉన్నారని ఇవి ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచలేదని టీఎంసీ ఆరోపిస్తోంది. ఎన్నికల సంఘం ముందు ఆయన అబాద్ధాలు చెప్పాడని నార్త్ 24 పరగనాస్ జిల్లా టీఎంసీ యూనిట్ సీనియర్ నాయకుడు సోమంత్ షామ్ ఆరోపించారు. అర్జున్‌సింగ్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు కోరుతూ తాము త్వరలోనే న్యాయస్థానాన్ని అదేవిధంగా ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నాడు.




రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి కొండకల్ వద్ద చేపట్టిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని జ్యోతి వెలగించి ప్రారంభించిన ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు హరీష్ రావు,సబితా ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ రంగంలో తొలి కోచ్ ఫ్యాక్టరీ

## భూమిపూజ చేసిన మంత్రి కెటిఆర్
## పారిశ్రామిక రంగంలో విప్లవం అని అభినందన
## తెలంగాణ పారిశ్రామికంగా పురోగమిస్తోందన్న కెటిఆర్

రంగారెడ్డి,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): ప్రైవేట్ రంగంలో తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం స్వాగతించాల్సిన విసయమని మంత్రి కెటిఆర్ అన్నారు. ఇదో ముందడుగని , కంపెనీ మేధాను అభినందించారు. దీంతో అనేకమందికి ఉద్యోగాలు రావడమే గాకుండా పారిశ్రామికంగా తెలంగాణ మరింత ముందుకు పోగలదన్నారు. రంగారెడ్డి జిల్లాలోని శంకర్ పల్లి కొండకల్ వద్ద 100 ఎకరాలు ఎనిమిది వందల కోట్ల వ్యయంతో చేపట్టిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైస్పీడ్ రైళ్లతో జీవన ప్రమాణాలు మారుతాయన్నారు. దీంతో పట్టణాల మధ్య దూరం తగ్గి రవాణా పెరగగలదని అన్నారు. హైదరాబాద్‌లో పనిచేసే వారు ఇతర ప్రాంతాల నుంచి నేరుగా ఇక్కడికి చేరుకోగలరని అన్నారు. మెట్రోలాంటి పథకాలకు కోచ్‌లు అందించగలదన్నారు. అయినా కాజీపేలో కేంద్రం ప్రభుత్వం తరపున కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఫ్యాక్టరీ జిల్లాకే కాక తెలంగాణకే తలమానికం అని పేర్కొన్నారు. జిల్లాకు రూ.800 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని ద్వారా వందలాది మందికి ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. జిల్లా ఫార్మా, ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు నెలవుగా మారనుంది. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాల్లోనూ ఘనత సాధించింది. ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఫార్మాసిటీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, హార్డ్‌వేర్ పార్కులతో పాటుగా ఉన్నత విద్యా సంస్థలు, వర్శిటీలు, పర్యాటకరంగాలకు కేంద్ర బిందువుగా రంగారెడ్డి జిల్లా మారింది. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ఆసక్తి చూపిస్తున్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ రైలు కోచ్‌లు, డీజిల్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల తయారీదారు కంపెనీ మేధా సర్వో డ్రైవ్స్ రూ.800 కోట్ల పెట్టుబడితో శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో తమ యూనిట్‌ను నెలకొల్పనున్నది. ఇందుకోసం 2017లోనే ప్రభుత్వంతో మేధా ఒప్పందం కుదుర్చుకోవడంతో టీఎస్ఐఐసీ వంద ఎకరాల భూ సేకరణ చేపట్టింది' అని తెలిపారు. అనంతరం శంకర్ పల్లి మండలంలోని మోకీల చౌరస్తాలో టీఆర్ఎస్ జెండాను మంత్రి ఎగురవేశారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, జడ్పీ చైర్మన్ అనితా రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, మెదక్ ఎంపి ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తవుడు బస్తాల మధ్య మద్యం సరఫరా

సూర్యాపేట,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): తవుడు బస్తాల మధ్యలో మందు బాటిళ్లు రవాణా చేస్తున్న వారిని కోదాడ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.34 లక్షలుగా గుర్తించారు. మునగాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వారిని కోదాడ పోలీసులు ఆకస్మికదాడి చేసి పట్టుకున్నారు. ఈ మద్యం విలువ దాదాపు రూ.1.34లక్షలు ఉంటుందని సీఐ శ్రీనివాసులరెడ్డి, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంచాయితీ

నేటి నిజం
శుక్రవారం 14-8-2020

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నీటికి సంబంధించిన వివాదం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సహజం గానే ఇరు రాష్ట్రాల సిఎంల మధ్య సయోధ్య ఉన్నా ఎందుకనో కలసి మాట్లాడాలని అనుకోవడం లేదు. ఇద్దరూ కూర్చుని జలవివాదాలు లేకుండా చూసుకుందామని గతంలో చేసిన ప్రకటనలను మరచి పోయారు. ఒకరినొకరు సహకరించుకుందామని అనుకున్నారు. కానీ పోతిరెడ్డిపాడుపై జరుగుతున్న పనులకు సంబం ధించి ఇద్దరు సిఎంలు కావాలనే మౌనంగా ఉన్నారు. ఇద్దరూ ఎవరికి వారు గుంభనంగా ఉ ంటున్నారు. ఈ ఒక్క విషయంలోనే ఇద్దరూ ఎవరికి వారు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇరు నేతల మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపిస్తోంది. దీనిపై సిఎం కెసిఆర్ నోరు మెదపాలని అంటోంది. సిఎం కెసిఆర్ కూడా సమీక్షలో మాత్రం ఎపి సిఎం జగన్ తీరుపై మండి పడ్డారు. ఇంటికి పిలిచి అన్నం పెడితే కిరికిరి ఏంటని ప్రశ్నించారు. మరోవైపు రాయలసీమ లిఫ్ట్‌కు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది.రాయలసీమ లిఫ్ట్ అక్రమమంటూ తెలంగాణ వాదిస్తోంది. రయలసీమ లిఫ్ట్ మాకు న్యాయం రావాల్సిన వాటా, న్యాయంగా రావాల్సిన నీటిని తీసుకోవడం కోసం కడుతున్న ప్రాజెక్టే...కొత్త ప్రాజెక్ట్ కాదు కాబట్టి అదేమీ అక్రమం కాదు అని ఆంధ్రప్రదేశ్ వాదిస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య సహృద్భావ వాతావరణం ఉంది...రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడడం ద్వారా సమస్యను పరిస్కరించుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. అలాగే జగన్‌తో సత్సంబం ధాలు ఉన్నాయని కెటిఆర్ ఇటీవలే ప్రకటించారు. అలాంటప్పుడు పోతిరెడ్డిపాడుపై ఎందుకు మాట్లాడం లేదన్న సందేహాలు సహజంగానే వస్తున్నాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడు కోకుండా సమస్యను జఠిలం చేస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మాత్రమే ఈ అంశాన్ని వివాదం చేస్తున్నారు. కావాలనే వివాదాన్ని ఇంకా పెద్దదిగా చేస్తున్నారనేది రెండు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ విస్తరణ ద్వారా రోజుకు మూడు టీఎంసీలను తీసుకెళ్లేందుకు తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంపై తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను పట్టించు కోనక్కరలేదని సీఎం జగన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పథకం సహా ఇతర స్కీంలపై తెలంగాణ వెలిబుచ్చుతున్న అభిప్రాయాలకు ఈ నెల 20వ తేదీ తర్వాత కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగగ్ షెకావత్ అధ్యక్షతన జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే సమాధానాలిద్దామని చెప్పినట్లు తెలిసింది. నీటి ప్రాజెక్టులపై జలవనరుల శాఖ అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఈ భేటీలో చర్చకు వచ్చాయి. రాయలసీమ పథకంపై ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. సీఎం స్పందిస్తూ.. నీటి ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ కృష్ణా ట్రిబ్యునల్ కేటాయింపుల మేరకు చేపడుతున్నా మని చెప్పారు. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే సరైన సమాధానం చెబుదామన్నారు. 'పొరుగు రాష్ట్రంతో స్నేహపూర్వక వాతావరణం ఉండాలని కోరుకుంటున్నాం. కానీ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంటే అంగీకరించేది లేదు. నాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రాజెక్టుల నిర్మాణంపై రాష్ట్ర విభజనకు ముందునుంచి ఇచ్చిన ఉత్తర్వులను సిద్ధం చేయండని ఆదేశించారు. రాష్ట్ర వాదనను బలంగా వినిపిద్దామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంలో దీనిపై కేసు వేసింది. కేసులతో తేలదని గతంలో సిఎం కెసిఆర్ స్వయంగా ప్రకటించారు. అయినా తప్పని స్థితిలో సుప్రీం గడప దొక్కక తప్పలేదు. ఈ దశలో కృష్ణా బోర్డు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

సంగమేశ్వరం లిఫ్ట్ ద్వారా బేసిన్ అవతలికి నీటి తరలింపు చట్టబద్ధమేనంటూ కృష్ణా బోర్డు కొత్త వివాదానికి తెరలేపింది. బచావత్ అవార్డులోనే అలా ఉందంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవి÷-లో పేర్కొంది. కృష్ణా బోర్డు సభ్యుడు హరికేశ్ మీనా ఈ అఫిడవిట్ ఫైల్ చేశారు. పిటిషనర్ లేవనెత్తినట్లుగా బేసిన్ అవతలికి కృష్ణా నీటి తరలింపు చట్టవ్యతిరేకం కాదని, బచావత్ అవార్డు ఎనిమిదో చాప్టర్‌లోని పేజీ నం.128 దీనిపై స్పష్టతనిచ్చిందని అందులో పేర్కొన్నారు. దీనిపై తెలంగాణ ఇంజనీర్లు మండిపడుతున్నారు. బచావత్ రికమండేషన్స్ పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండానే కృష్ణా బోర్డు తప్పుడు అఫిడవిట్ ఫైల్ చేసిందని మండి పడుతున్నారు. ఏపీకి అనుకూలంగా ఉండేందుకు బచావత్ అవార్డ్‌లోనే తప్పులు ఆపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ తెలంగాణకు నష్టం చేసేలా ఏపీ సంగమేశ్వరం లిఫ్ట్ స్కీం, పోతిరెడ్డిపాడు విస్తరణ ప్రాజెక్టులను చేపట్టిందని.. చట్టవిరుద్ధం గా పెన్నా బేసిన్‌కు కృష్ణా నీటిని తరలిస్తోందని నారాయణపేట జిల్లాకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ ఎన్జీటీలో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దానిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిన కృష్ణా బోర్డు.. బేసిన్ అవతలికి నీటి తరలింపు చట్టబద్ధమేనని ఎన్జీటీకి తెలిపింది.రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాకు సాగు, తాగునీటి కోసం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తున్నారని.. కొత్తగా చేపట్టే సంగమేశ్వరం ద్వారా ఆ ప్రాజెక్టులకే నీళ్లిస్తున్నారని ఏపీ చెప్తోందని తెలంగాణ ఇంజనీర్లు అంటున్నారు. ఇన్నాళ్లు అక్రమంగా నీళ్లు తరలించుకున్న ప్రాజెక్టులను ఇప్పుడు లీగల్ చేసేలా కృష్ణాబోర్డు వ్యవహరించిందని స్పష్టం చేస్తున్నారు.పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ తీసుకుంటున్న నీటి లెక్కలను తప్పుగా చూపుతున్నా బోర్డు ఇంతవరకూ అడగలేదు. తెలంగాణ విషయానికి వచ్చేసరికి బోర్డు వేగంగా స్పందిస్తూ బ్రేకులు వేయడానికి ప్రయత్ని స్తోంది. మొత్తంగా ఈ వ్యవహారంలో దోబూచులాటలు సాగుతున్నాయి. ఇది ఇద్దరు సిఎంలు కూర్చుని మాట్లాడుకుంటే తేలేపని గాదని తాజా వ్యవహారాలను బట్టి తెలుస్తోంది.

## తమిళనాట బంధువుల్లో ఆనందం

### అనందం పంచుకున్న కమలా హారిస్ పిన్ని

చెన్నై,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): కమలా హారిస్ అమెరికా ఉపాధ్య పదవికి పోటీపడడంతో ఇప్పుడు ఆమె పేరు తమిళనాట మరోమారు మార్మోగింది. ఆమె తల్లిది తమిళనాడు కావడంతో ఆమె బంధువులంతా ఆనందంలో మునిగిపోయారు. కాగా కమలా హారిస్ తల్లి శ్యామలా గోపాలన్ తమిళనాడుకు చెందిన వారన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ బంధువులను కలిసేందుకు తన సోదరి మాయతో కలిసి ఆమె అనేకసార్లు భారత్‌కు వచ్చారు. ఇక తల్లిని తన రోల్‌మోడల్‌గా భావించే కమల.. పలు సందర్భాల్లో తన భారత మూలల గురించి గర్వంగా చెప్పుకొన్నారు. భారత సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా తల్లి తమను పెంచారని, ఆమెతో పాటు తాతయ్య పీవీ గోపాలన్ తమపై ఎంతో ప్రభావం చూపారని చెప్పు కొచ్చారు. కాగా కమల తండ్రి డొనాల్డ్ హారిస్. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో జమైకాకు చెందిన డొనాల్డ్‌తో శ్యామలా గోపాలన్‌కు ఏర్పడిన పరిచయం పెళ్లికి దారితీసింది. అయితే కమలా హారిస్‌కే ఏడేళ్ల వయసు ఉన్నపుడే వీరిద్దరు విడిపోయారు. దీంతో తండ్రితో కమలకు అనుబంధం తక్కువే. కమల మమ్మల్ని మరోసారి గర్వపడేలా చేసిందంటూ కమలా హారిస్ చిన్నమ్మ సరళా గోపాలన్ ఉద్వేగానికి లోనయ్యారు. తన అక్క కూతురు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండేదని, తమ పట్ల ఎంతో ఆప్యాయత కనబరిచేదని గుర్తు చేసుకున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగిన జో బిడెన్ వైస్ ప్రెసిడెంట్ రేసులో కమలా హారిస్‌ను నిలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ అవకాశం దక్కించుకున్న తొలి నల్లజాతి మహిళగా ఆమె అరుదైన ఘనత సాధించారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన కమలా హారిస్ తల్లి తరపు బంధువులు ఆనంద డోలికల్లో తేలియాడుతున్నారు. కమలా హారిస్ తల్లి శ్యామలా గోపాలన్ సోదరి డాక్టర్ సరళా గోపాలన్ ఆనందం పట్టలేకపోతున్నారు. తనలో నాకు ఎక్కువగా నచ్చేది స్పందించే గుణమే అంటూ కూతురి గురించి చెప్పుకొంటూ మురిసిపోయారు. ప్రస్తుతం తను ఎన్నికల హడావుడిలో ఉంటుంది కాబట్టి మాట్లాడలేక పోయానని, త్వరలోనే తీపి కబురు వింటానంటూ హర్షం వ్యక్తం చేశారు.

## వర్షంలోనే పంద్రాగస్ట్ రిహార్సల్స్

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ప్రతి యేటా ఆగష్టు 15న ఇండిపెండెన్స్ డే రోజు భారత ప్రధాని ఎర్రకోట మీద జెండా ఎగురవేస్తారు. అందుకోసం రెండు రోజుల ముందుగానే త్రివిధ దళాలు రిహార్సల్స్ చేస్తాయి. ఈ సంవత్సరం కూడా రిహార్సల్స్ సాగుతున్నాయి. ఢిల్లీలో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక ఇండిపెండెన్స్ డేకు రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో.. త్రివిధ దళాలు వర్షంలోనే రిహార్సల్స్ చేస్తున్నాయి. భద్రతా బలగాలు కూడా గొడుగులు, రెయిన్ కోట్లతో ఎర్రకోట చుట్టూ పహారా కాస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు, పార్టిసిపెంట్స్ కూడా రెయిన్ కోట్లు వేసుకొని హాజరయ్యారు. వర్షాన్ని లెక్కచేయకుండా త్రివిధ దళాలు గౌరవ వందన కార్యక్రమం పూర్తి చేశాయి. కరోనా నేపథ్యంలో.. కార్యక్రమానికి వచ్చేవారందరూ సామాజిక దూరాన్ని పాటించేలా ఏర్పాట్లు చేశారు. ఆగష్టు 15న ఎర్రకోటపై ప్రధాని మోడి జాతీయ జెండాను ఎగురవేసి.. జాతిని ఉ ద్దేశించి ప్రసంగించనున్నారు. రెడ్ ఫోర్ట్, జామా మసీద్, చాందిని చౌక్, ఓల్డ్ ఢిల్లీ తదితర ఏరియాలను భద్రతా బలగాలు ఇప్పటికే తమ కంట్రోల్ లోకి తీసుకున్నాయి

## కరోనా బారిన పడ్డ మహంత్ నృత్య గోపాల్ దాస్

### –గుర్గావ్ మేదాంత ఆసుపత్రికి తరలింపు

మధుర,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): రామ జన్మభూమి ట్రస్ట్ చీఫ్ మహంత్ నృత్య గోపాల్ దాస్ కరోనా వైరస్ బారిన పడటం కలకలం రేపుతోంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల నేపథ్యంలో ఆయనకు పరీక్షలు నిర్వహించగా, గురువారం కోవిడ్–19 నిర్ధారణ అయింది. కృష్ణ జన్మాష్టమి వేడుకల నిమిత్తం మధుర వెళ్లిన ప్రస్తుతం ఆయనకు ఆగ్రా చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలోని బృందం మెరుగైన చికిత్స అందిస్తోంది. ఉత్తరప్రదేశ్ సీఎం ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు మహంత్ ను మెరుగైన చికిత్స కోసం గుర్గావ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించనున్నామని మధుర జిల్లా మేజిస్ట్రేట్ రామ్ మిశ్రా వెల్లడించారు. ఆగష్టు 5న ఉత్తరప్రదేశ్‌లో అయోధ్యలో నిర్వహించిన రామమందిరం భూమి పూజ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు వేదికను పంచుకున్న ఈయన తాజాగా కరోనా వైరస్ బారిన పడటం ఆందోళన రేపింది. ఇదే వేదికపై యూపీముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్, బీజేపీ సైద్ధాంతిక గురువు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఉండటం గమనార్హం. కాగా అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుకకు కొన్ని రోజుల ముందు, పూజారి ప్రదీప్ దాస్ సహా మరో 14 మంది పోలీసులకుకూడా వైరస్ సోకిన సంగతి తెలిసిందే.

## మున్నార్ ప్రాంతంలో మరో రెండు మృతదేహాలు

### –కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో 55కు చేరిన మృతుల సంఖ్య

తిరువనంతపురం,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): మున్నార్ సమీపంలోని రాజమలలోని పెట్టిముడి ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బుధవారం మరో మూడు మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికి తీయగా మృతుల సంఖ్య 55కు చేరింది. ఒక మృతదేహాన్ని పెట్టిముడి సమీపంలోని గ్రావెల్ బ్యాంక్ ప్రాంతం నుంచి వెలికి తీశామని, వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే ఇవాళ వెలికి తీసిన మరో మృతదేహాన్ని కన్నన్, సీత లక్ష్మి దంపతుల కుమార్తె నబియా (12)గా గుర్తించారు. మిగతా 15 మంది ఆచూకీ కోసం అధికారులు ప్రయత్నాలు జరుగుతుండగా, వారిలో ఎక్కువగా పిల్లలు ఉన్నట్లు భావిస్తున్నారు. గత గురువారం రాత్రి భారీ ఎత్తున బురద జారగా వరుసగా ఆరో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూలీల క్వార్టర్ల సమీపంలో ప్రవహిస్తున్న పెట్టిముడి వాగు నుంచి మృతదేహాలను వెలికి తీశారు. క్వార్టర్ల నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. పెరియార్ నదికి ఉపనది అయిన ముతిరపుళా నదిలోకి ప్రవాహం వెళ్తోంది. శిథిలాల వద్ద ప్రవాహం భారీగా ఉండడంతో నీటిలో మునిగిపోయిన వారిలో కొందరు నదిలో కొట్టుకుపోయి ఉండవచ్చని రెస్క్యూ వర్కర్లు తెలిపారు. మిగతా వారి ఆచూకీని గుర్తించడం కఠినంగా ఉందని, ఎందుకంటే నది దిగువ ప్రాంతాలకూ విస్తరించాల్సి ఉంటుందని వర్కర్లు పేర్కొంటున్నారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం పోలీసులు, అటవీ, రెవెన్యూ, హెల్త్, పంచాయతీ అధికారులు, ఎన్జీవో కార్యకర్తలతో పాటు 52 మంది సభ్యులతో కూడిన ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి.

# అందానికి ఆరోగ్యానికి నడుమ....!

ప్రపంచమే కుగ్రామమైంది. జీవనశైలిలో వేగం పెరుగుతోంది. యువత ఓపిక తరుగుతోంది. 'రెడీ మేడ్ ఫుడ్'కు గిరాకీ పెరుగుతోంది. శాకాహారం నుండి మాంసాహారం వరకు అన్ని 'రెడీ టు ఈట్' ప్యాకెట్లు సుపర్ మార్కెట్ మరియు మాల్స్ సెల్ఫ్ ల్లో ఆకర్షణీయ రంగులు, రూపాలలో వినియోగదారుల నోరూరిస్తున్నాయి. 'ప్రాసెస్డ్ ఫుడ్' కొనే ముందు ప్యాకెట్‌పై పొందుపరచిన ముద్రణ వివరాలను చదివే ఓపిక లేదా కనీస అవగాహన లేని సమాజంలో ప్రజలు అనారోగ్యాల పాలు కావడం తప్పదన్న విషయాన్ని అందరం అర్థం చేసుకోవాలి. కొనడానికీ మరియు తినడానికీ మధ్య వినియోగదారులు కొన్ని సెకన్లు ప్యాకెట్‌పై సూచించిన వివరాలను గమనించాలని, లేని యెడల పోషకాహార సంబంధ అసంక్రమిత వ్యాధులు (నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్, యన్‌సిడి) ప్రపంచవ్యాప్తంగా పెరగడం పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని గమనించాలి. ఇలాంటి యన్‌సిడి సంబంధిత వ్యాధులు అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం అయ్యేవి. నేడు వీటి తీవ్రత భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు, మరియు గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించడం ప్రమాద హెచ్చరికలను చేస్తున్నది. చౌకగా, సులభంగా, అధిక శక్తితో కూడిన పోషకాలు అతి తక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకొనుట ద్వారా అసంక్రమిత వ్యాధులు ఆధునిక సమాజాన్ని పట్టి పీడించుట జరుగుతోందనే వాస్తవాలు వణుకు పుట్టిస్తున్నాయి. గృహాలలో తయారు చేసిన సమతుల పోషకాహారానికి బదులు మార్కెట్లో సులభంగా సుందర ప్యాకెట్ల రూపంలో లభించే ఫాస్ట్ మరియు జంక్ ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడిన నవ్య మనిషి, ముఖ్యంగా పిల్లలు, యువత తమ ఆరోగ్యాలను కోల్పోతున్నారు. ఇలాంటి యన్‌సిడి రుగ్మత(అసంక్తమిత వ్యాధులు)లను తగ్గించడానికి ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకొంటున్నాయి. ఈ చర్యలలో ప్రధానమైనదిగా ప్రతి ఆహార ప్యాకెట్‌పై విధిగా ప్యాకెట్‌లోని ఆహారపు పోషకాలకు సంబంధించిన సమగ్ర వివరాలను ముద్రించాలని చట్టం చేశారు.

భారత దేశంలోని ప్యాకెట్ ఫుడ్ తయారు పరిశ్రమలు ప్యాకెట్‌పైన ఆహారపదార్థపు పేరు, అందులోని పోషకాల వివరాలు, బరువు, తయారీదారుడి పేరు మరియు అడ్రస్, బ్రాండ్ లాంటి వివరాలను ముద్రించాలనే నియమం పెట్టడం జరిగింది. వీటితో పాటుగా తయారీ మరియు ఎక్స్ పైరీ/ఎన్ని రోజులలో వాడాలనే తేదీలు, లాట్/కోడ్/బ్యాచ్ వివరాలు, నిలువ చేసే సూచనలు వంటి వివరాలను స్పష్టంగా లేబుల్స్ ముద్రించాలని 2009 చట్టం ద్వారా నియమం తీసుకువచ్చారు. ప్యాకెట్ పైన నిక్షిప్త వివరాలలో ప్రతి 100 గ్రాముల ఆహార పదార్థాలలోని శక్తి (కిలో కాలరీలలో), మాంసకృత్తులు (గ్రామ్‌లలో), పిండి పదార్థాలు (చక్కర మోతాదులు), కొవ్వులు (గ్రామ్‌లలో), లవణాలు (గ్రామ్‌లలో) మరియు సంతృప్త/ ట్రాన్స్ కొవ్వుల వివరాలను ప్యాకెట్‌పై చూపాలని నియమం తీసుకువచ్చారు. వినియోగదారులు సూపర్ మార్కెట్ లేదా మాల్స్ వద్ద ప్యాకెట్ ఫుడ్ కొనే సందర్భంలో వివరాలను గమనించటం లేదని సర్వే ఫలితాలు తెలుపుతున్నాయి. నీల్సన్ నిర్వహించిన సర్వే రిపోర్ట్ ప్రకారం 59 శాతం ప్రపంచ వినియోగదారులు చదివి అర్థం చేసుకునే ఓపిక లేదని నిర్ధారణ చేశారు. 2013లో కోల్‌కత్తాలో చేసిన మరో సర్వేలో 50 శాతం కౌమారదశ యువత ప్యాకెట్‌పై ముద్రిత వివరాలు గమనించటం లేదని అంచనా వేశారు. హైదరాబాద్, డిల్లీ సూపర్ మార్కెట్ కొనుగోలుదారులలో 20 శాతం మాత్రమే ప్యాకెట్‌పైన వివరాలను గమనించి కొంటున్నామని తెలిపారు. వీరిలో 40 శాతం వినియోగదారులు పూర్తి వివరాలను చదివే ఓపికను ప్రదర్శించలేదని, సంకేతాల రూపంలో ముద్రిస్తే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. ఆరోగ్యకర ఆహారం తీసుకోవడంతో పాటుగా అధిక కొవ్వులు, చెక్కరలు మరియు లవణసాంద్రత గల హైలీ ప్రాసెస్డ్ ఫుడ్ జంక్ ఫుడ్ తీసుకోవడం తగ్గించిన యెడల అసంక్రమిత (యన్‌సిడి) రోగాలకు అడ్డుకట్ట వేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్యాకెట్‌పైన స్పష్టతతో కూడిన పూర్తి పోషక విలువల వివరాలను సులభంగా చదివేలా ముద్రించడం మంచిదని వినియోగదారులు కోరుతున్నారు. జంక్ ఫుడ్ ప్యాకెట్లపైన 'హెచ్చరిక సంకేతాలు' (వార్నింగ్ సింబల్స్) ముద్రించాలని పలు దేశాలు చట్టాలు కూడా చేయడం ముదావహం. ఈ దిశలో 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాన్‌డర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా' చర్యల ప్రకారం ప్రతి ప్యాకెట్ ఫుడ్‌పైన కాలరీలు, ఫ్యాట్, ట్రాన్స్ ఫ్యాట్, షుగర్, సోడియం లాంటి వివరాలను ఎరుపు రంగులో ముద్రించాలని నిర్దేశించడం హర్షదాయకమని గమనించాలి. ప్రతి ప్యాకెట్ ముందు భాగాన విధిగా పూర్తి వివరాలను స్పష్టంగా సూచించాలనే నియమాలతో పాటుగా వినియోగదారులు కొనే ముందు తప్పక ముద్రిత వివరాలను గమనించాలని కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, తయారీదారులు మరియు వినియోగదారులు తమ తమ బాధ్యతలను నిర్వహించుట ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపన జరుగుతుందనటంలో సందేహం లేదు. వ్యవసాయ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, సుగంధ పాలు లాంటి ఆహార పదార్థాల విషయంలో ఈ నిబంధనల నుండి మినహాయింపు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఆధునిక వేగవంతమైన యుగంలో యువతతో పాటు ప్రజలు ప్యాకెట్ ఫుడ్ కొనడానికి మరియు తినటానికి మధ్య ప్యాకెట్‌పై సూచించిన వివరాలను తప్పక గమనించేలా చైతన్యవంతులు కావాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ప్రపంచవ్యాప్తంగా భారతీయుల్లో ఆనందం

## కమలాహారిస్ ఎంపికపై ఒబమా ట్వీట్

### సమర్థురాలైన పోరాటయోధురాలని కితాబు

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): కమలా హారిస్... ఇప్పుడు అమెరికాలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న పేరు. డెమొక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్షుడి రేసులో ఉన్న జో బిడెన్ ఆమెను తన డిప్యూటీగా ఎంపిక చేయడమే అందుకు కారణం. అయితే ఈ నిర్ణయంతో ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు మాత్రం ఉప్పొంగి పోతున్నారు. గెలుపోటములు పక్కన పెట్టి ఓ అగ్రరాజ్యానికి భారత మూలాలు ఉన్న మహిళను ఎంపిక చేయడం గర్వంగా ఫీలవుతున్నారు. కాలిఫోర్నియా సెనేటర్‌గా ఉన్న కమల (55) అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైన తొలి భారత సంతతి మహిళగా గుర్తింపు సాధించారు. ఈ అరుదైన గౌరవం అందుకున్న తొలి నల్ల జాతీయురాలామె. కమలా హారిస్ వార్తల్లో నిలవడం ఇదే మొదటి సారి కాదు. ఆమె 2019లో మార్టిన్ లూథర్ కింగ్ పుట్టినరోజు నాడు 'నేను అమెరికా అధ్యక్షురాలిగా పోటీచేయాలనుకుంటున్నా' అని ప్రకటించి సంచలనం సృష్టించారు. అయితే ధనబలం లేకపోవడం, మొదటి డిబేట్‌లో తగినన్ని ఓట్లు రాకపోవడంతో ఆమె వెనక్కి తగ్గారు. తాజాగా డెమొక్రటిక్ పార్టీ తరఫున అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికవడంతో మరోమారు ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. కమలా హారిస్ ఎంపికను ఆ దేశ నేతలు గొప్ప నిర్ణయంగా భావిస్తున్నారు. ఆమెను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. 'కమలా హారిస్ నాకు చాన్నాళ్లుగా తెలుసు. ఆమె ఈ పదవికి పూర్తి అర్హురాలు. హక్కుల కోసం నినదించే వారి గొంతుకగా ఆమె పోరాడుతున్నారని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు. ప్రజా సేవకురాలిగా, నాయకురాలిగా కమల తనను తాను ఇప్పటికే నిరూపించు కుందని కమలను అభినందిస్తూ హిల్లరీ క్లింటన్ ట్వీట్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది సెలబ్రిటీలు కమలకు మద్దతు తెలుపుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సెనేటర్‌గా కమల ఆరోగ్య రంగంలో సంస్కరణలు, వలసొచ్చిన వారికి పౌరసత్వం, మారణాయుధాలపై నిషేధం, పన్ను సంస్కరణలకు మద్దతు తెలిపారు. జాతివివక్షను మొదటి నుంచి ప్రశ్నించేవారామె. నల్లజాతీయుడు జార్జ్ ఫ్లాయిడ్ హత్య తరువాత జాతివివక్షకు గురయ్యే వారికి న్యాయం జరగాలని నినదించారు. అంతేకాదు పోలీస్ వ్యవస్థలో మార్పులు చేయాలని, మూకదాడులను నేరంగా పరిగణించాలనే ప్రజాభిప్రాయానికి కమల మద్దతు తెలిపారు.

ఆమె తల్లి తమిళనాడుకు చెందినది. తండ్రి మాత్రం జమైకాకు చెందిన నల్లజాతీయుడు. ప్రస్తుతం కాలిఫోర్నియా జూనియర్ సెనేటర్‌గా ఉన్న కమలా హారిస్ ఆక్లాండ్‌లో పుట్టారు. ఆమె తల్లి శ్యామలా గోపాలన్‌ది తమిళనాడు. తండ్రి డొనాల్డ్ హారిస్‌ది జమైకా. కమల అమ్మానాన్న అమెరికాలోని బర్కిలీ యూనివర్సిటీలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. ఆ తరువాత పెళ్లి చేసుకున్నారు. కమలకు ఒక చెల్లెలు ఉన్నారు. పేరు మాయ. ఆమె కూడా రాజకీయ ఉద్యమకారిణి. హిల్లరీ క్లింటన్ అమెరికా అధ్యక్ష పోటీలో ఉన్నప్పుడు ఆమె వద్ద పనిచేశారు. కమలా హారిస్ హోవర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా అందుకున్నారు. తరువాత 'హేస్టింగ్స్ కాలేజీ ఆఫ్ లా' నుంచి న్యాయ విద్య పూర్తిచేశారు. కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌గా, శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా అటార్నీగా కూడా పనిచేసిన తొలి మహిళగా, మొదటి నల్లజాతీయురాలుగా కమల గుర్తింపు పొందారు. ఆమె భర్త డగ్లస్ ఎంహాఫ్ కూడా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. చాలా ఇంటర్వ్యూ లలో కమలా హారిస్ అమ్మతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'నా జీవితంలో నన్ను ఎక్కువగా ప్రభావితం చేసిన వ్యక్తి మా అమ్మ' అంటారామె. కమలకు ఏడేళ్ల వయసున్నప్పుడు ఆమె తల్లితండ్రులు విడిపోయారు. ఇద్దరు బిడ్డల్ని వాళ్లమ్మ అన్నీ తానై పెంచింది. అందుకే వారికి తల్లితో అనుబంధం ఎక్కువ. తనకు బాధ్యతలు తెలియజేసి, రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు అమ్మే ప్రేరణ అంటారు కమల. అమ్మ ఆమెకు స్ఫూర్తి మాత్రమే కాదు సూపర్‌హీరో కూడా అంటారు.

## స్మార్ట్ ఫోన్ పంపిణీ పథకం చేపట్టిన పంజాబ్

చండీగఢ్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): 12వ తరగతి విద్యార్థులకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు అందజేసే 'పంజాబ్ స్మార్ట్ కనెక్ట్ స్కీమ్'ను ఆ రాష్ట్ర సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 12వ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులకు ఆయన స్వయంగా స్మార్ట్ మొబైల్ ఫోన్లను అందజేశారు. కరోనా నేపథ్యంలో పంజాబ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆ రాష్ట్రంలో 12వ తరగతి చదువుతున్న 1,74,015 మంది విద్యార్థులకు నవంబర్ నాటికి స్మార్ట్ మొబైల్ ఫోన్లను ఉచితంగా అందజేస్తారు. ఈ పథకం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.92 కోట్లు వ్యయం చేస్తున్నది.

## పార్లమెంట్ నిర్మాణానికి కంపెనీల షార్ట్ లిస్ట్

### మూడు ప్రధాన కంపెనీల పేర్లు పరిశీలన

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): పార్లమెంటు కొత్త భవన నిర్మాణ కాంట్రాక్టు అప్పగించడం కోసం కేంద్రం మూడు కంపెనీలను షార్ట్ లిస్ట్ చేసింది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్ అండ్ టీ) లిమిటెడ్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, షపూర్‌జీ పల్లొంజీ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు తుది దశ బిడ్డింగ్‌కు అర్హత సాధించాయి. మొత్తం ఏడు కంపెనీలు పార్లమెంటు భవన నిర్మాణంపై ఆసక్తి చూపగా కేంద్ర ప్రజా పనుల విభాగం నాలుగు కంపెనీల దరఖాస్తులను తిరస్కరించింది. షార్ట్ లిస్ట్ అయిన మూడు కంపెనీలు త్వరలోనే తమ్మ ÷నాన్షియల్ బిడ్స్‌ను సమర్పించనున్నాయి.

## గోషామహల్ వద్ద స్వల్ప ఉద్రిక్తత

### –కాంగ్రెస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): గోషామహల్ పోలీస్ గ్రౌండ్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎన్ఎస్‌యూఐ నాయకుడు వెంకట్‌ను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, విక్రమ్ గౌడ్, అనిల్ కుమార్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీ కాంగ్రెస్ నేతలు పోలీసులకు వాగ్వాదం జరిగింది. ఎన్ఎస్‌యూఐ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న విద్యా వ్యవస్థపై ప్రశ్నించే హక్కు వాళ్లకు ఉందన్నారు. అర్బన్, సెమి అర్బన్ పట్టణాల్లో స్కూళ్లు నడవడం లేదన్నారు. హైదరాబాద్‌లో ఆన్‌లైన్‌లో క్లాస్‌లు నడుస్తున్నాయని, జూన్, జులై, ఆగస్టు నెలల్లో సిలబస్ లాస్ అయిన విద్యార్థుల పరిస్థితి ఏంటో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. 62 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భట్టి పేర్కొన్నారు.సీఎం కేసీఆర్ పై జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. పోలీసులు కేసీఆర్ కు ఊడిగం చేయొద్దంటూ జగ్గారెడ్డి మండిపడ్డారు. మమ్మల్ని చంపండి కేసీఆర్ నే ఏలుకోమనండి అంటూ జగ్గారెడ్డి బూతులు తిట్టారు. మాకు పవర్ వచ్చిన రోజు మీ పరిస్థితి ఎంటో ఆలోచించండి అంటూ పోలీసులకు జగ్గారెడ్డి హెచ్చరించారు. డీజీపీ సంగతి తెలుసంటూ మండిపడ్డారు. మేము పవర్ లో ఉ న్నప్పుడు మాకు కూడా సెల్యూట్ కొట్టిన విషయం మరువొద్దని జగ్గారెడ్డి గుర్తు చేశారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

### –దొరికిన డబ్బు పోలీసులకు అందచేత

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఓ ఆటోడ్రైవర్ తన నిజాయతీని చాటుకున్నాడు. రోజుకు మూడు వందల రూపాయలు సంపాదించడమే కష్టంగా ఉన్న తరుణంలో తన ఆటోలో అతడికి సుమారు లక్షన్నర రూపాయల సొమ్ము దొరికింది. కానీ అతడు దానిలో ఒక్క రూపాయి ముట్టుకోకుండా పోలీసులకు అప్పగించి నిజాయతీని చాటుకున్నాడు. మహ్మద్ హబీబ్ నగరంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం మహ్మద్ హబీబ్ ఆటోలో ఇద్దరు మహిళలు ఎక్కారు. సిద్దంబర్ బజారు ప్రాంతంలో దిగారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో మహ్మద్ తాడబన్ ప్రాంతానికి చేరుకున్నాడు. వాటర్ బాటిల్ కోసం ప్యాసింజర్ సీటులో వెతికాడు. అతడికి ఓ బ్యాగ్ కనిపించింది. అది చూసి ఒక్కసారిగా షాక్ తిన్నాడు. ఏ బాంబో ఉంటే ఎంటి పరిస్థితి అనుకున్నాడు.

ఇంతలో మహ్మద్‌కి సిద్దంబర్ బజార్ ప్రాంతంలో దిగిన మహిళలు గుర్తుకు వచ్చారు. ఈ బ్యాగ్ వారిదే అయ్యుంటుందని భావించాడు. అక్కడి వెళ్లి వారి కోసం చూశాడు. కానీ కనిపించలేదు. దాంతో ధైర్యం చేసి బ్యాగ్ ఒపెన్ చేశాడు. దాన్నిండ డబ్బుల కట్టలు ఉన్నాయి. మొత్తం 1.40 లక్షల రూపాయలు ఉన్నాయి. వెంటనే దగ్గరిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. విషయం వారికి చెప్పాడు. ఇంతలో బ్యాగ్ మర్చిపోయిన మహిళ పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. మహ్మద్ ఆమెను గుర్తు పట్టాడు. అనంతరం బ్యాగ్‌ను ఆమెకు అందించాడు. పోయింది అనుకున్న డబ్బు దొరకడంతో సదరు మహిళ సంతోషించింది. మహ్మద్‌కు కృతజ్ఞతలు తెలపడమే కాక అతడికి ఐదు వేల రూపాయలు బహుమతిగా ఇచ్చింది. పోలీసులు మహ్మద్ నిజాయతీని ప్రశంసించడంతో పాటు అతడికి సన్మానం చేశారు.

## బస్తీ దవఖానాలతో పేదలకు వైద్యం

### –సమస్యలుంటే పరిష్కరిస్తాం: తలసాని

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బస్తీదవఖానాల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ప్రజల అవసరాన్నిబట్టి మరిన్నిఆస్పత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్న బస్తీదవఖానాల్లో విద్యుత్, తాగునీరు, చిన్నచిన్న మరమ్మతులు వంటివి ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. జీహెచ్ఎంసి పరిదిలోని ప్రజలకు వైద్యం, విద్యా రంగాలతో పాటు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.

వేలాది రూపాయలు ఖర్చుచేసి వైద్య చికిత్స పొందలేకపోతున్నపేద ప్రజల కోసం ఏర్పాటుచేసిన ప్రభుత్వాసుపత్రులు, బస్తీదవఖానాలలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగానే అందిస్తున్నట్టు తెలిపపారు. ఈ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని సూచించారు. మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రత్యేక ఆలోచనలతోనే బస్తీదవఖానాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు. గ్రేటర్ పరిధిలో 300 బస్తీదవఖానాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

## శిరోముండనం ఘటనపై రాష్ట్రపతి సీరియస్

### –పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో దళిత యువకుడు వరప్రసాద్‌కు శిరోముండనం ఘటనపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సీరియస్‌గా స్పందించారు. ఫిర్యాదు అందిన 24 గంటల వ్యవధిలోనే స్పందించిన కోవింద్ ఘటనలో బాధితుడికి పూర్తి స్థాయిలో సహకరించాలంటూ ఆంధ్రప్రదేశ్ జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో అసిస్టెంట్ సెక్రటరీ ఏ జనార్దన్ బాబుకు ఫైల్ ట్రాన్స్‌ఫర్ చేశారు. నేరుగా జనార్దన్ బాబుని కలవాలని వరప్రసాద్‌కు రాష్ట్రపతి కార్యాలయం ఆదేశించింది. శిరోముండనం ఘటనపై పూర్తి స్థాయి కాల్ రికార్డులు, వీడియో క్లిప్పులు, కాల్ రికార్డింగ్‌లతో వరప్రసాద్ జనార్దన్ బాబుని కలవనున్నారు. మరోవైపు రాష్ట్రపతి స్పందనపై శిరోముండనం బాధితుడు వర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి జోక్యంతో తనకు న్యాయం దక్కుతుందనే భరోసా ఏర్పడిందని చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో వైసీపీ నేత ఫిర్యాదుతో వరప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తీవ్రంగా గాయపరచడంతో పాటు పోలీస్ స్టేషన్‌లోనే శిరోముండనం చేశారు. ఘటనతో మనస్తాపం చెందిన బాధితుడు నేరుగా రాష్ట్రపతికి లేఖ రాసి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన రాష్ట్రపతి బాధితుడికి పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రత్యేక అధికారిని నియమించారు.

# ఉపరితల ఆవర్తనంతో ఏపిలో భారీ వర్షాలు

## సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు
## గోదావరి జిల్లాల్లో పొంగుతున్న వాగులు
## గిరిజన గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

విశాఖపట్నం,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏపిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు వాయువ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. రెండు రోజులు అక్కడే స్థిరంగా కొనసాగి, మరింత బలపడనుందని తెలిపింది. రానున్న నాలుగు రోజులు కోస్తాంధ్ర, యానాంలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో గంటకు 45-55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, 3.5 మీటర్ల ఎత్తులో ఎగసిపడే అలలతో సముద్రం అలజడిగా ఉంటుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరించింది. కోస్తాంధ్రలో ముసురు వాతావరణం నెలకొంది. విశాఖ, ఉభయగోదావరి, కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. తీర ప్రాంతంలో గంటకు 45-55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, 3.5 మీటర్ల ఎత్తులో ఎగసిపడే అలలతో సముద్రం అలజడిగా ఉంటుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది. ప్రస్తుతం బ్యారేజ్ నీటి మట్టం 9.40 అడుగులకు పెరిగింది. ఈ క్రమంలో అధికారులు 175 గేట్లు స్వల్పంగా ఎత్తివేసి 4.05 లక్షలు క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అలాగే ఉభయ గోదావరి జిల్లాలకు 10,500 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా పశ్చిమగోదావరి జిల్లా పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డాం వద్ద గోదావరి వరద నీరు 24.750 మీటర్లకు చేరింది. అలాగే పోలవరం వద్ద నీటిమట్టం 10.610 మీటర్లకు చేరింది. అటు కొత్తూరు కాజ్వేపై 5 అడుగుల మేర వరద నీరు వచ్చి చేరింది. దీంతో 19 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వార్షాలకు వాగుల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లా, వేలేరుపాడు మండలంలో ఎద్దు వాగు, లోతు వాగు కాజ్వే పైకి గోదావరి వరద చేరుకుంది. దీంతో ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నదికి ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం వద్ద గోదావరి ఉధృతి గంట గంటకు పెరుగుతుంది. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు వద్ద 24.75 మీటర్లు చేరింది. ఇప్పటికే స్పిల్ ఛానల్ కు అనుసంధానంగా ఉన్న గోదావరి గట్టు తెగిపోవడం తో స్పిల్ ఛానల్ మొత్తం వరద నీటితో నిండిపోయింది. పోలవరం వద్ద 10.61 వరకు నీటిమట్టం నమోదయింది. ప్రాజెక్ట్ ఎగువన ఉన్న కొత్తూరు కాజ్వే పైకి 5 అడుగులు నీరు చేరడంతో సుమారు 19 గిరిజన గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి సంవత్సరం గోదావరికి వరద వచ్చే సమయంలో కొత్తూరు కాజ్వే పై వరద నీరు చేరడంతో గిరిజన గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అయితే గోదావరి అడ్డుగా ఎగువ కాపర్ డ్యామ్ నిర్మించడంతో గోదావరి వరద తక్కువగా వచ్చిన ఉధృతి పెరిగి గిరిజన గ్రామాలను ముంచెత్తుతుంది. ప్రస్తుతం గోదావరి ఉధృతి గంట గంటకు పెరుగుతుండడంతో నిర్వాసిత గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కొత్తూరు కాజ్వే పై రాకపోకలకు పోలీసులు ఆంక్షలు విధించారు. గిరిజనులు ప్రయాణించేందుకు పడవలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

# ఆల్మట్టికి మళ్లీ పోటెత్తిన వరద

## భద్రాచలం వద్ద గోదావరి ఉరకలు

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): గత రెండురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల భద్రాచలం పరివాహక ప్రాంతంలోని వాగులు, వంకులు పొంగిపొర్లుతున్నాయి.. దీంతో.. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం అంతకంతకు పెరుగుతోంది. ప్రస్తుతం భద్రాచలం దగ్గర గోదావరి నీటిమట్టం 33 అడుగుల దాటి ప్రవహిస్తుంది. ఇక, ఎగువన ఉన్న తాలిపేరు కిన్నెరసాని ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోవడంతో.. గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో గోదావరి పరివాహక ప్రాంతంలో నీటి పరిమాణం పెరుగుతుంది.

గత రెండు రోజులుగా గోదావరిలో కూడా ప్రవాహ వేగం పెరిగింది. మరో రెండు మూడు అడుగులు పెరిగే అవకాశం ఉందని నీటిపా రుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే భద్రాచలం సమీపంలో 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.. ఈ ప్రాంతంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా 53 అడుగులకు చేరుకుంటే 3వ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు .అప్పుడు మాత్రమే ఈ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి 29.6 అడుగులకు చేరింది.

భద్రాచలం పుణ్యక్షేత్రం వద్ద స్నాన ఘట్టాలు నీట మునిగాయి. భద్రాచలం పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి 12 గంటలపాటు ఏకధాటిగా 13.5 సెం.మీ.ల వర్షం కురిసింది.

దీంతో.. గోదావరి కరకట్ట పక్కన అంబాసత్రం వద్ద ఉన్న చెరువు పొంగిపొర్లి.. ఆ నీరు రామాలయం పరిసర ప్రాంతాల వద్దకు చేరుకుంది. ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల్లో జల్లులు కొనసాగాయి. అత్యధికంగా ఎర్రుపాలెంలో 2.4 సెం.మీ. వర్షం కురిసింది. అశ్వాపురంలో ఇసుకవాగు పొంగి ప్రవహిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. ఇళ్లలోకి వరదనీరు చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

### ఆల్మట్టికి పోటెత్తిన వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. బుధవారం సాయంత్రానికి 1,26,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో.. అక్కడి నుంచి నారాయణపూర్ ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.

నారాయణపూర్ నుంచి బుధవారం సాయంత్రం 6 గంటలకు 14 గేట్లు ఎత్తి 1,22,200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు జూరాల ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందడంతో.. వారు అప్రమత్తమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 57 గేట్లు ఎత్తి 4.30 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో కిన్నెరసానికి భారీగా వరదనీరు చేరుతోంది. ఈ జలాశయం సామర్థ్యం 407 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 405 అడుగులకు చేరింది. దీంతో.. అధికారులు మంగళవారం రాత్రి 4 గేట్లుఎత్తి 17 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుకోవడంతో 7 గేట్లు ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

### సాగర్‌కు వరద ఉధృతి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు కాగా... ప్రస్తుత నీటిమట్టం 563.10 అడుగులకు చేరింది. అలాగే ఇన్‌ఎ÷-లో 38,140 క్యూసెక్కులు, అవుట్ ఎ÷-లో 8,422 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 312.0405 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటి నిల్వ 239.6552 టీఎంసీలుగా నమోదు అయ్యింది.

# కోటిపల్లి వద్ద ప్రాణహిత ఉధృతి

## లక్ష్మీబ్యారేజ్ వద్ద పెరుగుతున్న ప్రవాహం

ఆదిలాబాద్,,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): కోటపల్లి మండలాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నిండుగా ప్రవహిస్తోంది. వర్షాలతో వాగులు, వంకలలోని వరద నీరు ప్రాణహిత నదిలో కలుస్తుండటంతో నది ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. అటు, ఇటు వైపులా ఒడ్లను తాకుతూ వరద పోటెత్తింది. వెంచపల్లి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉండగా జనగామ, సూపాక, ఆల్గామా, పుల్లగామా, సిర్సా, అన్నారం, అర్జునగుట్ట, రాపన్‌పల్లి గ్రామాల వద్ద ఒడ్లపాలెం వరకు వరద కొనసాగింది. దేవులవాడ వద్ద గోదావరి నదితో ప్రాణహిత ప్రవాహం కలిసి మరింత ఉధృతంగా పెరిగి లక్ష్మిబ్యారేజ్ వైపు ప్రవాహం కొనసాగుతోంది. సిర్పూర్ నియోజక వర్గంలోని పలు మండలాల్లో వాగులపై వంతెనలు పూర్తి కాకపోవడంతో ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్-వాంకిడి మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు అంకుసాపూర్ వాగుపై 2013 సంవత్సరంలో రూ.1.50 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించారు. కానీ బ్రిడ్జి నిర్మాణానికి ఆది నుంచి అవాంతరాలే ఎదుర వుతున్నాయి. దీంతో రెండేళ్లలో నిర్మించాల్సిన వంతెన పనులు ఆరేళ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదు. కాగజ్ నగర్-అంకుసాపూర్-వాంకిడిని కలిసేందుకు ప్రత్యేక రోడ్డు సౌకర్యం కూడా పూర్తి చేశారు. నిధుల లేమి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి కావటం లేదు. బ్రిడ్జి పనులు కేవలం పిల్లర్ల స్థాయిలోనే మగ్గుతున్నాయి. 2018లో బ్రిడ్జి నిర్మాణ వ్యయాన్ని రూ.3కోట్లకు పెంచారు. వాస్తవంగా ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఆసిఫాబాద్‌తో సంబంధం లేకుండా నేరుగా కాగజ్‌నగర్ నుంచి వాంకిడికి వెళ్లేందుకు ఆస్కారం ఉంది. కానీ వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఏటా ప్రయాణికులకు తిప్పలు తప్పటం లేదు. చిన్నపాటి వర్షం కురిసిందంటే అంకుసాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి. కాగజ్‌నగర్-వాంకిడి మార్గాల్లో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. వర్షం కురిసిందంటే రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి. ఏటా ఇదే సమస్య పునరావృతం అవుతోంది. అధికారులు ముందస్తుగా స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు వేగవంతంగా అయ్యేట్టు చేస్తే బాగుంటుందన్నారు. కాగజ్‌నగర్-వాంకిడి మార్గంలో అంకుషాపూర్ వంతెన ఉంది. ఈ వంతెనపై బ్రిడ్జి నిర్మాణం కోసం 2013లో నిధుల విడుదల చేశారు. ఇప్పటి నిర్మాణం పూర్తికాలేదు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. నిధులు పెంచినా బ్రిడ్జి నిర్మాణంలో ఇంత వరకు పురోగతి లేదు. వర్షాకాలం వచ్చిదంటే పెద్దసిద్దాపూర్, చిన్నసిద్దాపూర్, కృష్ణపల్లి, సోమినితో పాటు మరో నాలుగు గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పటం లేదు. పెంచికల్‌పేటలోని ఎర్రగుంట వద్ద ఉత్సమల్లివాగుపై వంతెన లేకపోవటంతో స్థాని కులు ఇబ్బందులు పడుతున్నారు. లోడ్‌పల్లి వద్ద బొక్కివాగుపై వంతెన లేకపోవటంతో వర్షాకాలంలో గొల్లగూడ వాసులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. కాగజ్‌నగర్ నుంచి భీమిని వెళ్లే మార్గంలో జగన్నాథ్‌పూర్ గ్రామం సమీపంలోని వాగు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది.కాగజ్‌నగర్ మండలం నారాపూర్‌లో ప్రధానంగా హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. ఈ గ్రామానికి ఒక్క బస్సు, ఆటో కూడా రాదు. ద్విచక్ర వాహనం పైనే వెళ్లాల్సి ఉంటుంది. ఈ గ్రామంలో 50 కుటుం బాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామ పొలిమేరలోనే కుమరం భీం నుంచి పోయే నీటి కాల్వ ఉంటుంది. వర్షాకాలంలో ఈకాల్వలో మోకాలి లోతుతో ఎప్పటికీ నీరు ప్రవహిస్తుండటం వల్ల ఆటోలన్నీ గ్రామ పొలిమేర వరకే నడుస్తుంటాయి. అయితే అర్ధరాత్రి ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే దేవుడిపైనే భారం వేసి బతుకాల్సిన పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్‌కు సరిగ్గా 10కిలోమీటర్ల దూరం లోనే నారాపూర్ గ్రామం ఉండడం గమనార్హం. అధికారులు ముందస్తుగా స్పందించి ప్రత్యేకంగా హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని నారాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# వైను బప్పు గారి ఆశయాలను కొనసాగించడానికి విద్యార్థుల ఆలోచనలకు అనుభవజ్ఞులైనవారి అనుభవాలను కలిపి పనిచేయాలి: ఐఐఏ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

హైదరాబాద్,ఆగస్ట్13:నవీన విద్యార్థులు నూతన ఆలోచనలకు ఖగోళ భౌతిక శాస్త్ర రంగంలో సుమారు ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన భారతీయ ఖగోళ శాస్త్ర సంస్థలోని అనుభవజ్ఞులైనవారి ఆలోచనలను మిళితం చేయడం వలన సంస్థ వ్యవస్థాపకులు డా.వైనుబప్పుగారి ఆశయాలను సాధించవచ్చని ఐఐఏ 50వ వ్యవస్థాపక దినోత్సంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. "గొప్ప దూరదృష్టితో భారతీయ ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థను డా. వైనుబప్పు గారు ప్రారంభించిన సంస్థకు ఈ సంవత్సరం 50వ సంవత్సరంగా ఏంతో ప్రత్యేకమైనది. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా పునర్నిర్మాణ దిశగా అడుగులేస్తున్న దేశానికి ఉన్నత ఆశయాలు కలిగిన నాయకుల అవసరం ఎంతో ఉంది. వ్యవస్థాపకులు సంస్థను స్థాపించిన ఆశయాల సాధకు క్రొత్తవారి ఆలోచనలు మరియు గత ఐదు దశాబ్దాలుగా గడించిన అనుభశాలుర అనుభావలను మిళితంచేయవలసిన అవసరం ఉంద"ని ఐఐఏ-50వ సంవత్సరాల సంబరాలను ప్రారంభించిన డీఎస్టి కార్యదర్శి ప్రొ. అశుతోష్ శర్మ అన్నారు.

"ఇప్పటి వరకు ఐఐఏ నాణ్యమైన మానవ వనరులను, మౌళిక వనరులను మరియు ఖగోళ శాస్త్ర పరిశీలను శాస్త్రీయంగా లోతుగా పరిశీలించుటను మరియు సంస్థను నూతన దృష్టితో మరింత ఎత్తుకుతీసుకు వెళ్ళడానికి కృషి చేస్తుందని" ఆయన అన్నారు.భారత ప్రభుత్వపు శాస్త్ర మరియు సాంకేతిక విభాగం(డిఎస్టి) వారి పరిధిలో స్వయం ప్రతిపత్తి కలిగి పనిచేస్తున్న భారతీయ ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ(ఐఐఏ) 10 ఆగస్టు 2020న ఆన్లైన్లో 50వ వ్యవస్థాక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ ముఖ్య సాంకేతిక సలహాదారు ప్రొఫెసర్ కె. విజయరాఘవన్ ఉపన్యాసించారు.భారతీయ ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ(ఐఐఏ)కు తన విలువైన సేవలను అందించిన, వ్యవస్థాపకులైన డా. మనాలి కల్లత్ వైనుబప్పుగారి జన్మదినోత్సవం రోజున సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ సంవత్సరం సంస్థ 50వ సంవత్సరంలోనికి అడుగిడి 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది.




ఐఐఏ విద్యార్థులు తమ వ్యాసాలతో కూర్చిన సంచిక 'దూత్'ను ఐఐఏ పాలక మండలి అధ్యక్షులు ప్రొఫెసర్ అవినాష్ సి. పాండే విడుదల చేసారు. "శాస్త్ర సాంకేతిక విషయాలను సరళంగా సామాన్యులకు చేరే విధంగా విద్యార్థులు సృజనాత్మకతను జోడించడానికి ఈ సంచిక మంచి వేదికను కూర్చుతుంద"ని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఐఏ పూర్వ సంచాలకుల యొక్క క్లుప్త సందేశాలను ఈ సందర్భంగా ప్రజలకు అందించారు సంస్థ ప్రస్తుత సంచాలకులు ప్రొ. అన్నపూర్ణి సుబ్రమణ్యం

## పోలవరం నిధులపై ప్రత్యేక దృష్టి
### -కేంద్రానికి మరోమారు విన్నవించనున్న సర్కార్

అమరావతి,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుంచి రావలసిన నిధులపై ఏపి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఎంపిలు పులమార్లు కేంద్ర మంత్రులను కలసి నిధుల విడుదలకు సంబంధించి వివరాలను అందచేశారు. తాజాగా దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులకు సూచించారు. అలాగే పునరావాస కార్యక్రమాలకూ ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. సాగు నీటి సమీక్షలో కరోనా సమయంలోనే పోలవరం పనులు కొనసాగిస్తున్నామనిఅధికారులు వివరించారు. సెప్టెంబరు 15నాటికి పిల్లర్ల పనులు పూర్తవుతాయన్నారు. వర్షాకాలంలోనూ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. పోలవరం పునరావాస కార్యక్రమంపై దృష్టి సారించాలని.. ప్రాజెక్టుపై చేసిన వ్యయం బిల్లులను సిద్ధం చేసి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని సీఎం తెలిపారు. ఇక, అక్టోబరు నాటికి అవుకు టన్నెల్ -2 పూర్తి చేస్తున్నామని అధికారులు చెప్పారు. విజయనగరం జిల్లా ప్రాజెక్టులను కూడా త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. తోటపల్లిలో మిగిలిన పనులు సహా వివిధ ప్రాజెక్టులకు రూ.500 కోట్లు ఖర్చు పెడితే ఇక్కడ అన్ని ప్రాజెక్టులూ పూర్తవుతా యన్నారు. వెలిగొండ మొదటి టన్నెల్ నుంచి డిసెంబరులో నీటి విడుదలకు సిద్ధం చేస్తున్నామని అధికారులు చెప్పారు. వెలిగొండ-2 టన్నెల్‌నూ వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నెల్లూరు బ్యారేజీలో గేట్ల బిగింపు కార్యక్రమాన్ని చేపట్టామని అధికారులు చెప్పారు. దీనితోపాటు సంగం బ్యారేజీ పనులనూ నవంబరుకి పూర్తి చేస్తామన్నారు. వంశధార-నాగావళి అనుసంధాన పనులు డిసెంబరు చివరికి పూర్తి చేస్తామని వెల్లడించారు. వంశధార ప్రాజెక్టు -2, స్టేజ్ -2 పనులు వచ్చే మార్చి నాటికి పూర్తవుతాయని తెలిపారు. గండికోటలో 26.85 టీఎంసీలు నిల్వచేద్దామని సీఎం అన్నారు. చిత్రావతిలో పది టీఎంసీల నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాల న్నారు. గండికోట - పైడిపాలెం ఎత్తిపోతల అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని, గాలేరు-నగరి నుంచి హంద్రీ-నీవా లింకు పనులు కూడా వెంటనే చేపట్టాలన్నారు.

## ఢిల్లీలో కుండపోతకు రోడ్లు జలమయం

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో ఢిల్లీ అతలాకుతలమవుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ద్వారకాలోని అండర్‌పాస్ జలమయం అయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ ఏరియాలో వరద నీరు చేరడంతో.. స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీతో పాటు నోయిడా, రోహతక్, జింద్, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరిదాబాద్, ఆగ్రా, బులంద్‌షర్ ప్రాంతాల్లో మరో రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఢిల్లీలో గడిచిన పదేళ్లలో ఈ ఏడాది ఆగస్టులో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదు అయిందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు నెలలో 72 శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్పారు. గతేడాది ఆగస్టు నెలలో మొదటి 12 రోజులు.. 37.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## చారిత్ర సంఘటనల మీద విస్తృత అధ్యయనం జరగాలి :ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, ఆగష్టు 13:చారిత్రక సంఘటనల గురించి విస్తృతంగా అధ్యయనం జరిపి, అందులోని సమగ్రమైన, ప్రామాణికమైన మరియు కీలకమైన అంశాలను ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు నొక్కి చెప్పారు. "నేతాజీ సుభాష్ బోస్ ? ఐ.ఎన్.ఏ." ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కళ్యాణ్ కుమార్ దే రచించిన "నేతాజీ ? ఇండియాస్ ఇండిపెండెన్స్ అండ్ బ్రిటీష్ ఆర్కైవ్స్" పుస్తకాన్ని ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉపరాష్ట్రపతి భారత దేశ స్వరాజ్య సంగ్రామంలో నేతాజీ కృషిని వెలుగులోకి తీసుకొచ్చే ఎన్నో ఆసక్తికరమైన అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయని తెలిపారు.

భారతదేశ చరిత్ర, సంస్కృతి గురించి యువత సమగ్రంగా అధ్యయనం చేయవలసి అవసరాన్ని నొక్కి చెప్పిన ఉపరాష్ట్రపతి, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను, వారి శౌర్య గాథలకు పాఠ్యప్రణాళికలో చోటు కల్పించాలని సూచించారు. స్వరాజ్య సంగ్రామంలో శ్రీ సుభాష్ చంద్రబోస్ పోషించిన పాత్రను ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, చైతన్యవంతమైన, సాహసోపేతమైన నాయకత్వం ద్వారా ప్రజలకు ముఖ్యంగా యువతకు నేతాజీ స్ఫూర్తిని పంచారని పేర్కొన్నారు. ఐ.ఎన్.ఏ. శక్తి సామర్థ్యాలను ఈ పుస్తకంలోని కొన్ని అంశాలు తెలియజేస్తాయన్న ఆయన, ఐ.ఎన్.ఏ. పట్ల ప్రజల్లో సానుభూతి పెరగడం, బ్రిటీష్ పాలకుల వెన్నులో వణుకు మొదలైందని, స్వాతంత్ర్య సంగ్రామ విజయంలో ఇది కీలక పాత్ర పోషించిందన్నారు.

కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, నేతాజీ జీవితం నుంచి యువత ప్రేరణ పొంది, నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వరాజ్యం సముపార్జించుకుని ఏడు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా వివిధ రంగాల్లో భారతదేశం అనేక సవాళ్ళు ఎదుర్కోవడం ఆలోచించాల్సిన విషయమన్న ఆయన పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, కులం, లింగ వివక్షలు లేని, అందరికీ సమాన అవకాశాలు అందించే నవ భారత నిర్మాణ రథ సారథులుగా యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. భారతదేశ నాగరిక విలువలు, చరిత్ర మరియు సంస్కృతికి నేతాజీ గర్వకారణమని, గొప్ప దేశాలు తమ తలరాతను తామే రాసుకోగలవని ఆయన గట్టిగా విశ్వసించి, ప్రజల్లో ఈ స్ఫూర్తిని ప్రేరేపించే ప్రయత్నం చేశారని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ముందు భారతీయులనే విషయాన్ని నేతాజీ పరిపూర్ణంగా విశ్వసించారన్న ఆయన కులం, మతం, ప్రాంతం, భాష ఆధారంగా ఉన్న ఉపగుర్తింపులు భారతీయులమనే ప్రధాన స్ఫూర్తికి అడ్డుగా నిలవరాదన్నదే శ్రీ బోస్ అభిమతమని తెలిపారు.

భారతదేశం మరియు ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల మీద కోవిడ్ -19 మహమ్మారి ప్రభావాన్ని ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, ఈ మహమ్మారి మీద జరుగుతున్న పోరాటంలో విజయం సాధించేందుకు, ఇందులో భాగంగా ఎదురయ్యే సవాళ్ళను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ అధిక శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భారతదేశం లాంటి దేశాలు నిజమైన స్వావలంబనను పొందడం ద్వారా, ఎలాంటి పరిస్థితినైనా తట్టుకోగల సామర్థ్యం గల ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన ఆవశ్యకతను కోవిడ్ -19 బలంగా గుర్తు చేసిందన్న ఆయన, ఆత్మనిర్భర్ భారత్ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రైవేట్ రంగంతో పాటు పరిశోధనల ద్వారా శిక్షణా సంస్థలు సహా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం తక్షణావసరం అని పేర్కొన్నారు.

## మౌలిక సదుపాయాలు మరియు ఎం.ఎస్.ఎం.ఈ. రంగాల్లో అంతర్జాతీయ పెట్టుబడులను మెరుగుపరచాలని పిలుపునిచ్చిన - గడ్కరీ.

హైదరాబాద్,ఆగస్ట్13:భారత రహదారులు, ఎం.ఎస్.ఎం.ఈ. రంగాల్లో పెట్టుబడులు పెంచాలని, కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎం.ఎస్.ఎం.ఈ. శాఖల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు పిలుపునిచ్చారు. ఆటోమొబైల్ మరియు ఎం.ఎస్.ఎం.ఈ. రంగాలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి రెండు ముఖ్యమైన రంగాలని ఆయన పేర్కొన్నారు. రహదారి మౌలిక సదుపాయాలు మరియు ఎం.ఎస్.ఎం.ఈ.ల లో వాణిజ్య పెట్టుబడులు మరియు భాగస్వామ్యం పై భారత-ఆస్ట్రేలియా వాణిజ్య మండలి మరియు ఉమెన్నోవేటర్ ను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, రహదారి భద్రతా రంగంలో భారత, ఆస్ట్రేలియా దేశాలు ఇప్పటికే సహకరించుకుంటున్నాయని చెప్పారు. ఈ సహకారం రహదారులకు మెరుగైన డిజైన్లను, ప్రజలకు అవగాహన అవకాశాలను కల్పించిందని ఆయన అన్నారు. భారత రహదారి భద్రతా అంచనా కార్యక్రమం కింద, 21,000 కిలోమీటర్ల మేర రహదారుల అంచనా పూర్తి అయ్యింది. సుమారు 3,000 కిలోమీటర్ల పొడవైన రహదారి సాంకేతిక పరమైన అభివృద్ధిలో ఉంది. మెరుగైన రహదారి ఇంజనీరింగ్ మరియు ప్రజలలో అవగాహన మెరుగుపడిందని ఆయన అన్నారు. ఈ అభివృద్ధి / నవీకరణ కార్యక్రమాలు, రోడ్డు ప్రమాదాలను 50 శాతం మేర తగ్గిస్తాయని భావిస్తున్నారు. 2030 నాటికి రహదారి ప్రమాదాలలో ఎవరూ మృతి చెందకుండా చూడాలన్నదే మా లక్ష్యమని శ్రీ గడ్కరీ తెలియజేశారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి తమ మంత్రిత్వ శాఖ చాలా కార్యక్రమాలు చేపట్టిందని శ్రీ గడ్కరీ తెలియజేశారు. ఈ ప్రచారం కోసం ప్రపంచ బ్యాంకు మరియు ఎ.డి.బి. ఒక్కొక్కటి 7000 కోట్ల రూపాయల చొప్పున సహకారం అందించడానికి కట్టుబడి ఉన్నాయి. సామాజిక అవగాహన మరియు విద్య ద్వారా, అత్యవసర సేవలను మెరుగుపరచడం, వైద్య బీమా కోసం ఒత్తిడి చేయడం, మరిన్ని ఆస్పత్రులను అందించడం మొదలైన చర్యల ద్వారా భారతదేశం తన రహదారి భద్రతా లక్ష్యాలను సాధించడానికి చేరువ అవుతోంది. భారతదేశంలో రవాణా రంగానికి సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా రూపొందించిన మోటారు వాహనాల చట్టం-2019 గురించి ఆయన ప్రస్తావించారు.

## రోడ్డుప్రమాదాల నియంత్రణకు ప్రత్యేకచర్యలు
### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, ఆగష్టు 13(నేటినిజం ప్రతినిధి):రోడ్డుప్రమాదాల నియంత్రణకు పోలీస్‌శాఖ ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అతివేగం, అజాగ్రత్తవల్లనే ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారుల సహకారంతో ప్రమాదాల నియంత్రణకు చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ నేరసమీక్షా సమావేశం బుధవారంనాడు కమిషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డుప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా మొబైల్‌బారికేడ్లను ఏర్పాటు చేయడంతోపాటు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అన్నివర్గాల చెందిన ప్రజలు, వివిధ రకాల వాహనదారులు రోడ్డునియమనిబంధనలు పాటించడం ద్వారాకూడా రోడ్డుప్రమాదాలు నియంత్రలోకి వస్తాయని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలకు సేవలందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించడం, వారికి సేవలందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజల్లో పోలీసులకు ప్రత్యేక గుర్తింపుతోపాటు పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని తెలిపారు.

పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాలను చేధించడమే లక్ష్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల నేరాల దర్యాప్తుల్లో నాణ్యతప్రమాణాలను పాటించాలని చెప్పారు. దర్యాప్తుల్లోని నాణ్యతప్రమాణాలు ఉన్నట్లైతే నిందితులు శిక్షింపబడుతారని తెలిపారు. నేరాల చేధన ద్వారా ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం మరింతపెంపొందుతుందని పేర్కొన్నారు. ఎస్‌సి/ఎస్‌టి అట్రాసిటి కేసులను విచారణలను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాబోవు గణేష్ నవరాత్రులను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పటిష్టప్రణాళికలను రూపొందించుకుని ముందుకుసాగాలని చెప్పారు. ప్రస్తుతం నెలకునిఉన్న విపత్కర పరిస్థితులలో పోలీసులు విధినిర్వాహణ సందర్భంగా పూర్తిస్థాయిలో భద్రతచర్యలు తీసుకోవడంతోపాటు, వైద్యుల సూచనలు,సలహాలను పాటించాలని తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల నుండి గట్టేందుకు రోగనిరోధకశక్తిని పెంపొందించుకునేందుకు పోషక ఆహారంతోపాటు దినచర్యలో భాగంగా వివిధరకాల వ్యాయామాలను అలవర్చుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), ఏసిపిలు పి అశోక్, విజయసారథి, సుందరగిరి శ్రీనివాసరావు, సోమనాథం, శంకర్‌రాజు, కె శ్రీనివాస్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డిలతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## యూనియన్ హోం మినిస్టర్స్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్", 2020

హైదరాబాద్,ఆగస్ట్13:2020వ సంవత్సరానికి, "యూనియన్ హోం మినిస్టర్స్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్" పురస్కారాలను 121 మంది పోలీసు సిబ్బందికి ప్రదానం చేశారు. నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రమాణాలను ప్రోత్సహించేందుకు, అత్యుత్తమ పరిశోధన చేసిన పోలీసులను జాతీయ స్థాయిలో గుర్తించేందుకు ఈ అవార్డును 2018లో ఏర్పాటు చేశారు.

పురస్కారాలు స్వీకరించినవారిలో.., సీబీఐ నుంచి 15 మంది, మహారాష్ట్ర పోలీసులు 10 మంది, మధ్యప్రదేశ్ పోలీసులు 10 మంది, ఉత్తరప్రదేశ్ పోలీసులు 8 మంది, కేరళ పోలీసులు ఏడుగురు, పశ్చిమ బెంగాల్ పోలీసులు ఏడుగురు ఉన్నారు. మిగిలినవారు మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందినవారు. ఈ 121 మందిలో 21 మంది మహిళా పోలీసు అధికారులు ఉన్నారు.

## పి.ఎం. స్వనిధి పథకం కింద 5 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి

హైదరాబాద్,ఆగస్ట్13:ప్రధానమంత్రి వీధి విక్రేతల ఆత్మ నిర్భర్ నిధి (పి.ఎం-స్వనిధి) పథకం 2020 జులై, 2వ తేదీన ప్రారంభమైన నాటి నుండి 41 రోజుల్లో రికార్డు సంఖ్యలో 5 లక్షలకు పైగా దరఖాస్తుల అందాయి. వాటిలో రికార్డు సంఖ్యలో లక్ష మందికి పైగా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరిగింది. కోవిడ్-19 లాక్ డౌన్ తర్వాత తమ వ్యాపారాలను తిరిగి ప్రారంభించడానికి సరసమైన వర్కింగ్ క్యాపిటల్ రుణాల లభ్యత కోసం చూస్తున్న వీధి విక్రేతలలో పి.ఎమ్-స్వనిధి పథకం గణనీయమైన ఉత్సాహాన్ని సృష్టించింది.

'ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్' ఆధ్వర్యంలో పి.ఎం-స్వనిధి పథకాన్ని కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. కోవిడ్-19 లాక్ డౌన్ తర్వాత వారి వ్యాపారాలను తిరిగి ప్రారంభించడానికి వీలుగా పట్టణ పరిసర ప్రాంతాలు / గ్రామీణ ప్రాంతాల వారితో సహా పట్టణ ప్రాంతాలలో సుమారు 50 లక్షల మంది వీధి విక్రేతలకు ఒక సంవత్సర కాలంలో, ఒక్కొక్కరికీ 10,000 రూపాయల వరకు భాగస్వామ్య ఉచిత వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందుబాటులోకి తీసుకురావడం దీని లక్ష్యం. క్రమం తప్పకుండా ఋణాలు తిరిగి చెల్లించిన వారికి 7 శాతం వడ్డీ రాయితీ తో పాటు, నిర్ణీత డిజిటల్ లావాదేవీలను చేపట్టినవారికి సంవత్సరానికి 1,200 రూపాయల మేర క్యాష్ బ్యాక్ రూపంలో ప్రోత్సాహకాలతో పాటు తిరిగి రుణాలు పొందడానికి అర్హత లభిస్తుంది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులకు అదనంగా రుణాలు ఇచ్చే సంస్థలుగా నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు (ఎన్.బి.ఎఫ్.సి) తో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, స్వయం సహాయక బ్యాంకులు మొదలైనవాటితో సహా సూక్ష్మ-ఆర్థిక సంస్థలు (ఎం.ఎఫ్.ఐ) లను నిమగ్నం చేయడం ద్వారా ఈ 'నానో-వ్యవస్థాపకులు' యొక్క 'ఇంటి ముంగిటకు బ్యాంకులు' తీసుకురావాలని పి.ఎమ్-స్వనిధి పథకం సంకల్పించింది. అధికారిక పట్టణ ఆర్థిక వ్యవస్థలో భాగం కావడానికి విక్రేతల క్రెడిట్ ప్రొఫైల్‌ను రూపొందించడానికి డిజిటల్ చెల్లింపు వేదికలపై విక్రేతల బోర్డింగ్ చాలా ముఖ్యమైన భాగం.

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సి.ఐ.డి.బి.ఐ) ఈ పథకానికి అమలు భాగస్వామి. వీధి విక్రేతలకు రుణాలు ఇవ్వడాన్ని ప్రోత్సహించడానికి క్రెడిట్ అండ్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ప్రైజెస్ (సి.జి.టి.ఎం.ఎస్.ఈ) ద్వారా ఈ రుణ సంస్థలకు పోర్ట్‌ఫోలియో ప్రాతిపదికన గ్రేడెడ్ గ్యారెంటీ కవర్ అందించబడుతుంది.

వీధి విక్రేతలు ఎక్కువగా తమ వ్యాపారాలను చాలా తక్కువ లాభంతో నిర్వహిస్తారు. ఈ పథకం కింద అందజేసే మైక్రో-క్రెడిట్ మద్దతు అటువంటి అమ్మకందారులకు పెద్ద ఉపశమనం కలిగించడంతోపాటు, ఆర్థికంగా బలపడడానికి కూడా సహాయపడుతుంది. కనీస ప్రభుత్వం మరియు గరిష్ట పాలన లక్ష్యంతో సమాజంలోని ఈ విభాగానికి దాని పరిధిని మరియు ప్రయోజనాలను విస్తరించడంతో పాటు ఈ పథకాన్ని మరింతగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఏకీకృత ఐ.టి. వేదిక (pmsvanidhi.mohua.org.in), వెబ్ పోర్టల్ మరియు మొబైల్ యాప్ ను అందుబాటులో ఉంచడం జరిగింది.

## ప్రైవేట్ ఆస్పత్రల్లో దోపిడీ ఆపాలి: ఎమ్మెల్యే

విశాఖపట్నం,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులు కరోనా పేరుతో బాధితులను దోచుకుంటున్నాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు.19 రోజుల కిందట ఓ వ్యక్తి (38) లివర్ సమస్యతో రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేరితే కరోనా సోకినట్టు నిర్ధారించి చికిత్స చేస్తుండగా మంగళవారం మృతి చెందాడన్నారు. అయితే ఆ వ్యక్తి వైద్యానికి రూ.11.40 లక్షల బిల్లు వేశారని, అప్పటికే బాధితుని కుటుంబ సభ్యులు, ఆయన పనిచేసే షాపు యాజమాన్యం మూడు విడతలుగా రూ.తొమ్మిది లక్షల వరకు చెల్లించినా.. ఉదయం మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని రాత్రి వరకు ఇవ్వలేదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని వెలగపూడి డిమాండ్ చేశారు.

## రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచండి : ఎస్పీ రంగనాథ్



నల్లగొండ,,ఆగస్ట్13 : జైలు నుంచి విడుదలయ్యే నేరస్తులు, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై నిఘాను మరింత పెంచాలని జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా భౌతిక దూరం పాటిస్తూ పోలీస్ అధికారులతో ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీ షీటర్ల దినసరి కార్యకలాపాలపై సైతం నిఘా ఉంచాలని ఆదేశించారు.

జిల్లాలో ఎక్కడైనా పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడినట్లుగా తన దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొనే అధికారులపై విచారణ చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా గుట్కా, గంజాయి, పేకాట లాంటి అంశాలపై పర్యవేక్షణ చేస్తూ అలాంటి వారిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. వీటన్నింటితో పాటుగా ప్రతి పోలీస్ అధికారి విధిగా నాణ్యతతో కూడిన నేర విచారణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ డీజీపీ ఆదేశాలకు అనుగుణంగా నేర విచారణల్లో ముందుకు సాగాలని ఆయన అధికారులకు సూచించారు.

కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ విధి నిర్వహణ చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నర్మద, డీటీసీ అదనపు ఎస్పీ సతీష్ చోడగిరి, డీఎస్పీలు వెంకటేశ్వర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, రమణా రెడ్డి, సీఐలు రవీందర్, సురేష్, ఆదిరెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గౌరు నాయుడు, సదా నాగరాజు, బాలగోపాల్, శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, పరమేష్ తదితరులున్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకం

### -17న ఇంటర్వ్యూలకు ప్రకటన

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో మరింత మంది వైద్యుల అవసరం దృష్ట్యా కాంట్రాక్టుపద్ధతిలో వైద్యుల నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు గాంధీహాస్పిటల్, టిమ్స్‌లో పనిచే సేందుకు 35 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (జనరల్ మెడిసిన్)చ 35 మంది అసిస్టెంట్

ప్రొఫెసర్స్ (అనెస్తీషియా), మరో 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్స్(టీబీ అండ్ సిడి) నియాయమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పేర్కొంది. ఎంపికైన వారు ఒక సంవత్సరం పాటు పనిచేయాలని, అవసరమైతే వారి సేవలను మరికొంత కాలం పొడిగిస్తామని అధికారులు తెలిపారు. నెలకు 1,25,000 రూపాయల వేతనంతో పాటు ఇంటెన్సివ్‌లు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. వైద్యవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసి ఒక సంవత్సరం సీనియర్ రెసిడెన్సీ చేసిన వారు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని డీఎంఈ అధికారులు తెలిపారు. ఈనెల 17వ తేదీన ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు కోఠిలోని డిఎంహెచ్ఎస్ క్యాంపస్‌లోని డీఎంఈ ఆడిటోరియంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. అభ్యర్థులు ఒరిజినల్‌సర్టిఫికెట్‌లతో పాటు ఒకఫోటో, ఎస్ఎస్‌సి, ఎంబిబిఎస్, పిజి, సీనియర్ రెసిడెన్సీ సర్టిఫికెట్‌లు, కుల ధృవీకరణ సర్టిఫికెట్‌లు, రెండుపాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, టీఎస్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్‌తో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

## తక్షణ చర్యలకు హైకోర్టు ఆదేశాలు

### ప్రైవేట్ ఆస్పత్రి యాజామాన్యాల్లో ఆందోళన

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): కరోనా చికిత్స పేరుతో చేస్తున్న దోపిడీపై ప్రభుత్వం చర్యలు ఉపక్రమించడంతో ప్రైవేటు ఆస్పత్రులు ఆందోళన చెందుతున్నాయి. మంత్రి ఈటలతో ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు భేటీ కానున్నారు. కరోనా పేషెంట్లకు అందించే చికిత్సకు సంబంధించిన ధరల పట్టికను ఆస్పత్రి ఆవరణలో అందరికీ కనిపించేలా ప్రముఖంగా పెట్టాలని ప్రైవేటు ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రోగులకు ఇచ్చే బిల్లు వివరంగా ఉండాలని, ఏయే మందులు వాడారు? వాటికి ఎంత చార్జి చేశారు? తదితర వివరాలను బిల్లులో చూపించాలని ఆదేశించింది. ఇదిలావుంటే అత్యధిక ఫీజుల వసూలు, ట్రీట్మెంట్ విషయంలో ప్రజల ఫిర్యాదుల్ని తప్పని సరిగా తీసుకోవాలని, నోటీసులచ్చిన సదరు ఆస్పత్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ప్రభుత్వ జీవోను ఫాలో కావాలని, విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తే లైసెన్స్‌ను రద్దు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ప్రతీ ప్రైవేట్ హాస్పిటల్స్ వద్ద కరోనా ట్రీట్మెంట్ కు సంబంధించిన ఫీజుల బోర్డ్ ల ద్వారా డిస్ ప్లే చేయాలని చెప్పింది. అదేవిధంగా ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకుంటున్న ప్రైవేట్ హాస్పిటల్స్ ఎంత మందికి ఉచితంగా ట్రీట్‌మెంట్ అందించాయో చెప్పాలని హైకోర్ట్ విచారణ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఢిల్లీ ప్రభుత్వం కరోనా పేషెంట్స్ కోసం ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఉన్న బెడ్స్‌ను ఏ విధంగా తీసుకుందో వివరించిన హైకోర్ట్ .. తెలంగాణ ప్రభుత్వం అదే విధంగా ప్రైవేట్ ఆస్పత్రుల బెడ్స్‌ను ఎందుకు తీసుకోలేదో చెప్పాలంది.కరోనా వైరస్ పై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హైకోర్ట్ లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై హైకోర్ట్ విచారణ చేపట్టింది. విచారణకు ప్రభుత్వం తరుపున చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కరోనాపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యహరిస్తుంని హైకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కరోనా విషయంలో తాము గతంలో పలు ఆదేశాలిచ్చామని, ఆ ఆదేశాల్ని ప్రభుత్వం ఎందుకు ఫాలో అవ్వడం లేదని ప్రశ్నించింది. రెండు వారాల్లో కరోనా కు సంబంధించి ప్రభుత్వానికి ఇచ్చిన అదేశాల్ని పూర్తి చేయాలని హైకోర్టు అదేశించింది. ఇక రాష్ట్రం లో కరోనా నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్న హైకోర్ట్ .. ఎంతమంది ప్రైమరి కాంటాక్ట్, సెకండరీ కాంటాక్ట్ ఉన్న బాధితులకు పరీక్షలు చేశారో తెలపాలని సూచించింది.

# కరోనా కట్టడి చర్యల్లో అలసత్వంపై హైకోర్టు ఆగ్రహం

### ప్రైవేట్ ఆస్పత్రులపై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్న
### కరోనా నివారణకు చర్యలను వివరించిన సిఎస్

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వంపై హైకోర్టు మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణలో కరోనా పరిస్థితులపై గురువారం న్యాయస్థానంలో విచారణ జరిగింది. సీఎస్ సోమేష్‌కుమార్ విచారణకు హాజరయ్యారు. గతంలో ఇచ్చిన ఆదేశాలు ఏ ఒక్కటీ అమలు కాలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. కరోనాపై ఎందుకు ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమని ప్రశ్నించింది. ఈ సందర్భంగా తెలంగాణ చీఫ్ సెక్రటరీపై హైకోర్టు సీరియస్ అయింది. ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలను పీడిస్తున్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఎస్‌ను ఉద్దేశించి న్యాయస్థానం ప్రశ్నించింది. ఇప్పటివరకు 50 మందికి నోటిసులు ఇచ్చామని సోమేష్‌కుమార్ తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆస్పత్రుల లైసెన్స్ రద్దు చేశామని చెప్పారు. దీంతో మిగిలిన ఆస్పత్రుల పరిస్థితి ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. 50 ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చి కేవలం రెండు ఆస్పత్రులపై చర్యలకు పూనుకోవడంలో ఆంతర్యమేమిటని కూడా ప్రశ్నించింది. ప్రైవేట్ ఆస్పత్రులను ఎందుకు కట్టడి చేయడం లేదని ప్రశ్నించారు. అయితే కరోనా వైరస్ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని సీఎస్ సోమేశ్ కుమార్ హై కోర్టుకు తెలిపారు. కరోనా టెస్టులు, చికిత్సలపై హై కోర్టు విచారణ జరిపింది. రాష్ట్రంలో కరోనా టెస్టులు జరుపుతున్న తీరు, పాజిటివ్ వచ్చిన వారికి అందిస్తోన్న చికిత్స గురించి ప్రభుత్వం న్యాయస్థానానికి నివేదిక సమర్పించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని బెడ్స్ అన్నింటికి ఆక్సిజన్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఆగస్టు 3 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 42 వేల మంది సెంకడరీ కాంటాక్టులకు కరోనా టెస్టులు చేశామని, రాపిడ్ టెస్టులు ఎంతో ఉపయోగపడుతున్నాయని... రోజుకు 40 వేల టెస్టులు జరిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 46 ప్రయివేట్ ఆస్పత్రులకు నోటీసులకు ఇచ్చామన్నారు.

## ఉమ్మడి నల్లగొండను బంగారు ఖిల్లాగా మార్చిన సీఎం కేసీఆర్



సూర్యాపేట, ఆగస్ట్13: : గత ఆరు నెలలుగా కరోనా కారణంగా ప్రపంచంలోని అన్ని రంగాలు ఇబ్బంది పడుతుంటే, సంతోషంగా ఉన్నది కేవలం తెలంగాణ రైతు మాత్రమే అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లాలోని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం లో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి సాహసోపేత నిర్ణయాలో సీఎం కేసీఆర్ రాష్ట్ర రైతుల సంక్షేమం గురించి పని చేస్తున్నాడని తెలిపారు.

కరోనా కారణంగా పండిన పంటను ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచకుండా ఉన్న రైతాంగానికి మార్గం చూపారు. ప్రతి ఊరిలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పండిన ప్రతి గింజని కొన్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు.2014 కంటే ముందు ఎడారిలా ఉన్న నల్లగొండ జిల్లా ఆరేండ్లలో సర్వతో ముఖాభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక, ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ రామకృష్ణా రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు రజాక్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అమెరికా అధ్యక్ష ప్రచారంలో ముందున్న బిడెన్

### రిపబ్లికన్ డొనాల్డ్ ట్రంప్ పై పైచేయి
### సర్వేలో వెల్లడయయిన నిజాలు

వాషింగ్టన్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): అనూహ్యంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బిడెన్ ముందుకు దూసుకు వచ్చారు. రిపబ్లికన్ డొనాల్డ్ ట్రంప్ పై పైచేయి కలిగివున్నట్లుగా తేలింది. ఓ సర్వే ప్రకారం ఇద్దరు అభ్యర్థుల మధ్య కేవలం 5శాతం తేడా మాత్రమే ఉందని తేలింది. ప్రచారానికి సంబంధించి జూలై 12 నుంచి ఆగస్టు 12 వరకు సుమారు 32 వేర్వేరు సర్వే ఫలితాలు వెలువడ్డాయి. వీటన్నిటి లోనూ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బిడెన్ ముందున్నారు. అయితే ఈ సర్వేలలో ఇద్దరు అభ్యర్థుల మధ్య వ్యత్యాసం 5 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం విశేషం. అమెరికాలో 2020 నవంబర్‌లో జరుగనున్న అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. మూడొంతుల ఓటర్లు పోస్టు ద్వారా ఓటు వేసే అవకాశాలు ఉన్నాయి. న్యూయార్క్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం, అలాంటి ఓటర్లు సుమారు 80 మిలియన్లు ఉన్నారు. ఇవి అమెరికన్ చరిత్రలో అత్యధికం.. 2016 నాటి కన్నా రెట్టింపు. వాస్తవానికి, చాలా రాష్ట్రాలు కరోనా వైరస్ వ్యాప్తికి భయపడి పోస్టల్ ఓటింగ్ కోసం సన్నాహాలు చేశాయి. ఎన్నికలకు 100 రోజుల కన్నా తక్కువ సమయం మిగిలి ఉన్న పరిస్థితిలో ప్రచారం ఏ స్థాయిలో ఉందన్నది ఆసక్తిగా మారింది. జాతీయ సగటులో బిడెన్ 51 శాతం ఓట్లు సాధించగా, ట్రంప్‌కు కేవలం 41 శాతం ఓట్లు వచ్చాయి. అంటే బిడెన్ కంటే 10 శాతం తక్కువగా ట్రంప్కు పోలయ్యాయన్నమాట. 91 శాతం డెమోక్రాట్ మద్దతుదారులు బిడెన్‌తో ఉండగా, 87 శాతం రిపబ్లికన్లు ట్రంప్‌తో ఉన్నారు. తనను వెనుకగా ఉన్నట్లు చూపిస్తున్న అన్ని సర్వేలను నకిలీవిగా పేర్కొనడమే కాకుండా తన గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.రెండు నెలల్లో తొలిసారిగా ట్రంప్‌కు ఎక్కువ విరాళాలు అందినట్లు గణాంకాలు చెప్తున్నాయి. జూన్ నెలలో ట్రంప్‌కు రూ.982 కోట్లు, బిడెన్‌కు రూ.1057 కోట్లు విరాళాలు అందగా.. జూలై నెలలో ట్రంప్‌కు అధికంగా రూ.1237 కోట్లు, బిడెన్‌కు రూ.1050 కోట్లు వచ్చాయి. సెప్టెంబర్‌లో 15 రాష్ట్రాల్లో బిడెన్ ఎన్నికల ప్రచారానికి డెమోక్రాటిక్ పార్టీ రూ.2100 కోట్ల రిజర్వ్ ఫండ్ ఏర్పాటు చేసింది. ఇందులో టీవీ ప్రకటనల కోసం రూ.1650 కోట్లు, డిజిటల్ ప్రకటనల కోసం రూ.450 కోట్లు ఖర్చు చేయనున్నారు. కాగా, టీవీలో ట్రంప్ ప్రచారం కోసం రూ.1085 కోట్లను రిపబ్లికన్ పార్టీ ఖర్చు చేయనున్నది. అమెరికాలో నవంబర్ 3న అధ్యక్ష ఎన్నికలు జరుగడానికి ముందు డొనాల్డ్ ట్రంప్, జో బిడెన్ మధ్య అధ్యక్ష చర్చలు జరుగుతాయని కమిషన్ ఆన్ ప్రెసిడెన్షియల్ డిబేట్ (సీపీడీ) తెలిపింది. మొదటి చర్చ సెప్టెంబర్ 29 న ఒహియోలోని క్లీవ్‌ల్యాండ్‌లో జరుగుతుంది. రెండవ చర్చ అక్టోబర్ 15 న ఫ్లోరిడాలోని మయామిలో.. మూడవ చర్చ అక్టోబర్ 22 న టేనస్సీలో జరుగుతుంది. అన్ని డిబేట్లు 90 నిమిషాలపాటు కొనసాగుతాయి. వైట్ హౌస్ పూల్ నెట్‌వర్క్ ఎటువంటి ప్రకటన లేకుండా ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

## అంబులెన్స్‌కు చెక్కు అందించిన ఎమ్మెల్యే

వికారాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. తన పుట్టిన రోజుకు బహుమతులు, బొకేలు తేవొద్దు. పేదల ముఖాల్లో చిరునవ్వులు పూయించే పనులు చేపట్టండని పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. మంత్రి పిలుపు మేరకు పలువురు ప్రజాప్రతినిధులు కరోనా కష్టకాలంలో సాయంచేసేందుకు ముందుకొస్తున్నారు. తమ వంతుగా అధునాతన ఏసీ అంబులెన్స్ కొనుగోలు కోసం పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సొంత డబ్బులు 20.50 లక్షల రూపాయల చెక్కును కేటీఆర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.



గిఫ్ట్ ఎ స్మైల్ కింద అంబులెన్స్ కొనుగోలు కోసం మంత్రి కెటిఆర్‌కు 20.50 లక్షల రూపాయల చెక్కును అందచేసిన పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

## అమీన్‌పూర్ ఘటనపై దర్యాప్తు వేగం

### సమగ్ర విచారణకు ఆదేశించిన శిశు సంక్షేమశాఖ
### ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేశామన్న పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): అమీన్‌పూర్‌లో మైనర్ బాలికపై అఘాయిత్యం ఘటనకు సంబంధించిన దర్యాప్తు వేగవంతమైంది. మైనర్ బాలిక మృతిపై హైపవర్ కమిటీ సమావేశం కానుంది. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. హైపవర్ కమిటీలో బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అపర్ణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు అన్నపూర్ణ దేవి, ఉమెన్ సేఫ్టీ ఏసీపీ డి.ప్రతాప్, మహిళా కమిషన్ కార్యదర్శి సునంద ఉన్నారు. కాగా కమిటీ సమావేశం తర్వాత బాలిక కుటుంబ సభ్యులు, బంధువులను కలవనుంది. బాలిక బావ అనిల్ సీడబ్ల్యూసీ, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనితో పాటు కుటుంబ సభ్యులను కమిటీ విచారించనుంది. సదనంలో బాలికను నిరంతరంగా అత్యాచారం చేయడంతో ఆ బాలిక అనారోగ్యంతో మృతి చెందింది. దీనిపై నిర్వాహకులపై కేసు నమోదయ్యింది.

సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మైనర్ బాలిక అత్యాచారం కేసుకు సంబంధించి డి.ఎస్.పి రాజేశ్వర్ రావు మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని చెప్పారు. ప్రధాన నిందితుడు ఆశ్రమానికి దాతలుగా ఉన్న వేణుగోపాల్ రెడ్డి తో పాటు ఆశ్రమ నిర్వాహకులు విజయ, జయదేవ్‌లను పూర్తిస్థాయిలో విచారణ జరపగా.. వేణుగోపాల్ రెడ్డి బాలికపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు నిర్ధారించడం జరిగి ందన్నారు. ఆశ్రమ వార్డెన్ విజయ, ఆమె సోదరుడు జయ దేవ్ ఇందుకు సహకరి ంచినట్టు తేలిందన్నారు. బాలిక హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అంతకు ముందే బాలిక స్టేట్‌మెంట్ రికార్డ్ చేశాం.జరిగిన అన్యాయం గురించి బాలిక పూర్తిగా వివరించింది. బాలికతో పాటు మరికొంత మంది చిన్నారుల అభిప్రాయలను రికార్డ్ చేశాం. లాక్ డౌన్‌లో ఈ ఘాతుకం జరిగింది. మే నెలలో బాలిక బోయిన్‌పల్లి లోని కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్ళింది. ఆ సమయంలో అమ్మాయి ఒంటపై గాయాలయ్యాయని తెలిపారు. ఈ కేసులో రెండు ఎఫ్ఐఆర్ లు నమోదు చేశామని డిఎస్‌పీ చెప్పారు. ఒక కేసు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో బాలికపై జరిగిన అత్యాచారం, మరొక కేసు బాలికపై జరిగిన భౌతిక దాడి. ఈ విష యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల ప్రకార ం జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందని అన్నారు. బాలికపై ఆమె బంధువులే భౌతిక దాడికి పాల్పడ్డారా లేదా హాస్టల్‌లో ఎవరైనా దాడికి పాల్పడ్డారా అని విచారణ జరుగుతోందన్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉందని.. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం కమిటీ ఏర్పాటు చేయడం జరిగి ందని చెప్పారు. ఇప్పటివరకు ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిం చామని పూర్తిస్థాయిలో ఉచారణ చేపడుతున్నామని డిఎస్పీ చెప్పారు. ఇప్పటికే నిందితు లపై 2012 పోక్సో చట్టం ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు.

## ప్రగతిభవన్ ముట్టడిలో రమ్యారవు తనయుడు

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ప్రగతి భవన్ ముట్టడి కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ప్రగతి భవన్ ముట్టడించిన వారిలో కేసీఆర్ మనవడు రితేష్ ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో రితేష్‌ను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఏ5గా చేర్చుతూ... రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వంపై రితేష్ తల్లి.. కేసీఆర్ అన్న కూతురు రమ్యారావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రగతి భవన్‌ను ముట్టడించడం ఉద్రిక్తతకు దారి తీసింది. బుధవారం ఉదయం పీపీఈ కిట్లు ధరించి ఓ డీసీఎంలో అక్కడికి చేరుకున్న విద్యార్థి సంఘం నేతలు, కార్యకర్తలు... ఒక్క సారిగా ఆందోళన చేపట్టారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఓ విద్యార్థి ఇనుప గ్రిల్స్ ఎక్కి లోపలకు దిగాడు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో మిగతా నాయకులందరూ అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

## ప్రగతిభవన్‌లో పంద్రాగస్ట్ వేడుకలకు అవకాశం ?

### జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధుల పతాకావిష్కరణ
### కొవిడ్ నిబంధనల మేరకు వేడుకల నిర్వహణ

హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ):పంద్రాగస్టు వేడుకలు ఈ సారి ప్రగతి భవన్‌లోనే జరిగే అవకాశాలు ఉన్నాయి. కరోనా నేపథ్యంలో కేందరం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోయినా.. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రగతి భవన్‌లోనే నిర్వహించవచ్చని తెలిసింది. వర్షాలు కూడా భారీగా పడే అవకాశం ఉండడంతో పరిమిత సంఖ్యలో ఆహ్వానాలు ఇచ్చి జరపనున్నట్లు సమాచారం. అధికారులు కూడా ఇక్కడే మేలని సూచించారని సమాచారం. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లోనే పతాకావిష్కరణ చేస్తారని సమాచారం. వాస్తవానికి 2019 సంవత్సరపు గణతంత్ర ఉత్సవాలు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండులో జరిగాయి. ఆ తర్వాత అన్ని ఉత్సవాలను నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2019లో జూన్ 2న రాష్ట్రావతరణ ఉత్సవాలు, ఆగస్టు 15న స్వాతంత్య దినోత్సవం పబ్లిక్ గార్డెన్‌లో జరిగాయి. ఈ సంవత్సరం గణతంత్ర ఉత్సవాలు కూడా అక్కడే జరిగాయి. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో జూన్ 2న రాష్ట్రావతరణ ఉత్సవాలు మాత్రం ప్రగతి భవన్‌లో జరిగాయి. సీఎం కేసీఆర్ అక్కడే జెండాను ఆవిష్కరించారు. అలాగే ఈ నెల 15న స్వాతం త్య దినోత్సవాన్ని కూడా ప్రగతి భవన్‌లోనే నిర్వహిస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కరోనా తగ్గుముఖం పట్టకపోవడం, పంద్రాగస్టుకు పోలీసు పరేడ్ ఉండకపోవడం వంటి కారణాలతో ప్రగతి భవన్‌లోనే ఉత్సవాన్ని నిర్వహిస్తారని సమాచారం. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ 15న ఉదయం 10.30 గంటలకు జెండాను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే జెండావిష్కరణ ఎక్కడన్నదీ స్పష్టం చేయలేదు. మిగతా 32 జిల్లా కేంద్రాల్లో జెండాలను ఎగురవేసే మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల వివరాలను వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు.

వేడుకల సందర్భంగా కోవిడ్ నిబంధనలు పాటించాలని, జెండావిష్కరణకు పరిమిత సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. దీనికితోడు స్కూలు పిల్లలను వేడుకల్లో మినహాయించారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అంతర్జాతీయ యువ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్,ఆగస్ట్13: అంతర్జాతీయ యువ దినోత్సవం సందర్భంగా, కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. ఏ దేశానికైనా అతి పెద్ద బలం, ఆస్తి యువతేనంటూ వరుస ట్వీట్లు చేశారు. గొప్ప ఆశయాలు, నైపుణ్యాలున్న యువశక్తిని దేవుడి ఆశీస్సులతో భారత్ పొందిందని పేర్కొన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ కలలుగన్న 'నవ భారత్' కోసం యువత తప్పకుండా కష్టపడుతుందని అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు.

తాము నడిచే దారిలో ఎదురయిన అవకాశాలతో అద్భుతాలు సృష్టించే శక్తి నైపుణ్యవంతులు, ఉత్సాహవంతులైన యువతకు ఉందని అమిత్ షా అన్నారు.

నైపుణ్య భారత్, అంకుర భారత్, భారత్‌లో తయారీ, కొత్త విద్యావిధానం (ఎన్ఈపీ) వంటి కార్యక్రమాల ద్వారా, యువతలో దాగున్న అపారశక్తిని వెలికితీసే వ్యవస్థలను మోదీ ప్రభుత్వం నిరంతరం సృష్టిస్తోందని అమిత్ షా తన ట్వీట్‌లో వెల్లడించారు.

## సొసైటీతో తోటి వారికి అండగా ఉంటాం

### -మార్షల్ ఆర్ట్స్ హెల్పింగ్ సొసైటీ టెక్నికల్ కమిటీ సభ్యుడు ఎం ఏ మన్నాన్



వేములవాడ, ఆగష్టు 13 (నేటినిజం ప్రతినిధి ): ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కరాటే మాస్టర్లను ఆదుకోడానికి మార్షల్ ఆర్ట్స్ హెల్పింగ్ గ్రూప్ సొసైటీ ద్వారా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంఎ మన్నాన్ అన్నారు. మార్షల్ ఆర్ట్స్ హెల్పింగ్ గ్రూప్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కోర్ ఆర్గనైజింగ్ టెక్నికల్ కమిటీ లను నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఇబ్రహీం, చైర్మన్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ మేరకు కు తెలంగాణ రాష్ట్రం నుండి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కు చెందిన సీనియర్ మాస్టర్ జర్నలిస్టు ఎం ఏ మన్నాన్ ను టెక్నికల్ కోర్ కమిటీ సభ్యునిగా నియమించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్నాన్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో లాక్ డౌన్ సందర్భంగా కరాటే మాస్టర్లు ఆర్థిక ఇబ్బందులతో బాధపడవద్దు అని, ఇలాంటి వారి కోసం సంస్థ తరపు నుండి సాయం అందించేందుకు వెల్ఫేర్ సొసైటీ నుండి ప్రత్యేక సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన నియామకానికి కి కృషి చేసిన సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఇబ్రహీం, చైర్మన్ ఇస్మాయిల్ , కార్యవర్గ సభ్యులకు ,ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## మహిళా సంఘం భవనానికి భూమి పూజ



వేములవాడ, ఆగష్టు 13 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం మల్యాల గ్రామంలో మహిళా సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిధులు రూపాయల 10 లక్షలు మంజూరు కాగా భవన నిర్మాణానికి గురువారం సర్పంచ్ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ అబ్రహం భూమి పూజ చేశారు, మహిళా సంఘం భవనానికి 2 గుంటల స్థలాన్ని సర్పంచ్ లక్ష్మీనారాయణ విరాళంగా ఇచ్చాడు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతమి, ఐకేపీ ఏపీఎం రజిత, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు,

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



వేములవాడ, ఆగష్టు 13 (నేటినిజం ప్రతినిధి): సామూహిక రైతు జీవిత బీమా మూడవ సంవత్సరం కోసం రైతుల నుండి భీమా కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చందుర్తి మండల వ్యవసాయ అధికారి దుర్గారాజు తెలిపారు, 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు రైతులు రైతు బీమా పథకానికి అర్హులని ఇట్టి రైతులు ఆధార్ కార్డు తో పాటు నామిని ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకంతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలన్నారు, ఒక్కొక్క రైతుకు ప్రభుత్వం శ్రీతిఇ కి 3486 రూపాయల చొప్పున ప్రీమియం చెల్లించడం జరుగుతుందన్నారు, ఈ రైతు బీమా పథకం ఈ సంవత్సరానికి ఆగస్టు 2020 నుండి 13 ఆగస్టు 2021 వరకు అమలులో ఉంటుందన్నారు, అర్హత కలిగిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు,

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.